మంగళవారం
24-01-2023

విజయవాడ ప్రచురణ

సంపుటి : 71, సంచిక : 212
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

టర్కీలో మే14న అధ్యక్ష ఎన్నికలు

అధ్యక్ష ఎన్నికలు మే14వ తేదీన జరుగుతాయని టర్కీ అధ్యక్షుడు రెసప్ తయ్యిప్ ఎర్డోగాన్ ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం అధ్యక్ష, పార్లమెంటరీ ఎన్నికలు జూన్ 18న జరగాల్సి ఉండగా, పరీక్షలు, వ్యవసాయ పనులు వంటి కాలానుగుణ పరిస్థితుల కారణంగా ముందస్తుగా నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.

2లో

ఉద్యోగ సంఘంపై జగన్ సర్కార్

కక్ష సాధింపు

గవర్నర్‌ను కలవడంపై నోటీసులు జారీ

ఫిర్యాదు చేయలేదు... సమస్యలు చెప్పాం

కొన్ని ఉద్యోగ సంఘాలు సంతోషపడుతున్నాయి

భవిష్యత్‌లో వారికి కూడా ఇదే పరిస్థితి వస్తుందేమో: సూర్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఉద్యోగుల జీతాలపై ప్రశ్నించిన ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘంపై జగన్ సర్కార్ కక్ష సాధింపులకు దిగింది. సకాలంలో జీతాలు, పెన్షన్‌లు చెల్లించడం లేదని, ఉద్యోగుల పెండింగ్ బకాయిలు ఇవ్వడం లేదని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు ఉద్యోగ సంఘ నేతలు ఫిర్యాదు చేయడంపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. నేరుగా గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కే ఆర్ సూర్యనారాయణకు సాధారణ పరిపాలన శాఖ (హెచ్‌ఆర్) నుంచి నోటీసులు జారీ చేశారు. వేతనాలు, ఆర్థిక అంశాలు వంటి ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని సంప్రదించే అనేక వేదికలు ఉండగా, గవర్నర్ వద్దకు ఎందుకు వెళ్లారంటూ నోటీసులిచ్చారు. క్రమశిక్షణా ఉల్లంఘన కింద ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘాన్ని ఎందుకు రద్దు చేయకూడదో తెలపాలని, దీనిపై పేర్కొంటూ, వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలంటూ నోటీసు జారీ చేశారు. ఈనెల 19న జగన్ ప్రభుత్వంపై ఫిర్యాదు చేసేందుకు ఏపీ ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి భాస్కరరావులతోపాటు మొత్తం ఆరుగురు నేతలు రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను కలిశారు. ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం సకాలంలో చెల్లించలేక పోతోందంటూ ఫిర్యాదు చేశారు. కోట్లాది రూపాయల బకాయిలు, పెన్షన్ల చెల్లింపుకు గవర్నర్ జోక్యం చేసుకోవాలని, లేకపోతే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు

- మిగతా 2 లో

సమానత్వం కోసం

నిరంతర పోరు

చే పోరాటం అజరామరం

- ఆయన త్యాగం టీ షర్టులు, టోపీల్లో వద్దు
- ప్రజా ఉద్యమాల్లో మమేకం కావాలి
- అదే నా తండ్రికి నిజమైన నివాళి
- చే గువేరా కుమార్తె అలైదా
- క్యూబా సంఘీభావ సభలో కీలక ప్రసంగం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తన తండ్రి చే గువేరా పోరాట పటిమ అజరామరం అని, విశ్వవ్యాప్తంగా చే గువేరా అభిమానులు విప్లవ పోరాటం ద్వారా స్ఫూర్తి పొందాలని చేగువేరా కుమార్తె డాక్టర్ అలైదా గువేరా పిలుపునిచ్చారు. తన తండ్రి వారసత్వాన్ని టీ షర్టుల్లోను, టోపీల్లోను చూడటం భావ్యం కాదనీ, ఆయన త్యాగం, ఆ ధైర్యం, ఆ తెగువ పుణికిపుచ్చుకుని ప్రజాఉద్యమాల్లో మమేకమవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో సోమవారం క్యూబా సంఘీభావ సభ నిర్వహించారు. తొలుత క్యూబా సంఘీభావ ఆహ్వాన సంఘం కన్వీనర్ బుడ్డిగ జమిందార్ సభకు స్వాగతం పలుకుతూ, క్యూబాపై అగ్రరాజ్యమైన అమెరికా పెత్తందారి పోకడల్ని వివరించారు. ముక్తకంఠతో క్యూబాకు సంఘీభావం తెలపాలన్నారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా డాక్టర్ అలైదా గువేరా(చే గువేరా కుమార్తె), ప్రొఫెసర్ ఎస్తేఫానియా గువేరా (చే గువేరా మనుమరాలు), వామపక్ష పార్టీలు, వైసీపీ, టీడీపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నేతలు, అభ్యుదయవాదులు, రచయితలు పెద్దఎత్తున హాజరయ్యారు. సభకు క్యూబా సంఘీభావ ఆహ్వాన సంఘం కన్వీనర్ సుంకర రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. అలైదా గువేరా ప్రసంగిస్తూ తన తండ్రి వారసత్వంగా తాను వైద్యవృత్తిని చేపట్టానని, ఆ వృత్తి తనను ప్రజల హృదయాల చెంతకు చేర్చిందని నొక్కిచెప్పారు. సంఘీభావమనేది ఇవ్వడం ద్వారా గొప్పమనస్సును చాటుకునేదనీ, భారత దేశంలోనే కాక, ప్రపంచంలోనే చాలా

- మిగతా 2 లో

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ

ఆపాల్సిందే

రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ, ఏఐటీయూసీ ఆందోళనలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యోచన ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, ఏఐటీయూసీ పిలుపు మేరకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కార్మికులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా, 30 న జరిగే కార్మిక గర్జనను జయప్రదం చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో పెందుర్తి కూడలిలో సోమవారం జరిగిన సంఘీభావ దీక్షలో టీడీపీ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ (ఎన్‌డి) తదితర పార్టీల నేతలు పాల్గొని

- మిగతా 2 లో

సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్ బదిలీ

అదనపు డీజీగా ఎన్.సంజయ్ బాధ్యతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అత్యంత వివాదాస్పద అధికారిగా విమర్శలు ఎదుర్కొంటున్న ఏపీ సీఐడీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు బదిలీ చేసింది. అయితే ఇది బదిలీ వేటా? లేక సాధారణ బదిలీయా అనేది తేలాల్సి ఉంది. వైసీపీ ఎంపీ రఘురామకృష్ణరాజు కేసుతో పాటు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ప్రతిపక్ష పార్టీకి చెందిన ముఖ్యనేతలకు మీడియాలో వచ్చిన వార్తల ఆధారంగా నోటీసులు జారీ చేయడం, అధికార పార్టీ నేతలు ప్రతిపక్ష నేతలపై ఇచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వారిని విచారణకు పిలిపించడం, సోషల్ మీడియాలో పాలకపక్ష నేతలపై ఎవరు పోస్టింగ్ చేసినా వారిపై కేసులు నమోదు చేయడం, అధికారపార్టీ నేతలు ప్రతిపక్ష నేతలపై అసభ్యంగా పోస్టులు పెట్టినా పట్టించుకోకపోవడం వంటి అనేక అంశాల్లో సునీల్‌కుమార్‌పై తీవ్ర విమర్శలున్నాయి. ఆయనపై చర్యలు

- మిగతా 2 లో

పదవి నుంచి తప్పుకుంటా!

మోదీకి చెప్పిన మహారాష్ట్ర గవర్నర్ కోషియారీ

ముంబై : ఛత్రపతి శివాజీపై చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్షాల ఆగ్రహానికి గురైన మహారాష్ట్ర గవర్నర్ భగత్ సింగ్ కోషియారీ సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ ముందు తన పదవికి రాజీనామా చేయాలనే కోరికను వ్యక్తం చేశారు. ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి తన శేష జీవితాన్ని చదవడం, రాయడం, ఇతర కార్యకలాపాలలో గడపాలనుకుంటున్నట్లు చెప్పారు. 'గౌరవనీయులైన ప్రధాన మంత్రి ఇటీవల ముంబై పర్యటన సందర్భంగా, అన్ని రాజకీయ బాధ్యతలను విడిచిపెట్టాలని, నా శేష జీవితాన్ని చదవడం, రాయడం, ఇతర కార్యకలాపాలలో గడపాలని నా కోరికను నేను ఆయనకు తెలియజేశాను. ప్రధాన మంత్రి నుంచి ఎల్లప్పుడూ ప్రేమ, ఆప్యాయతను పొందుతాను.

ఈ విషయంలో నేను అదే విధంగా స్వీకరిస్తానని ఆశిస్తున్నాను' అని రాజ్ భవన్ నుంచి ఒక ప్రకటన పేర్కొంది. ప్రధాని మోదీ జనవరి 19న ముంబైలో అనేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేశారు. 'మహారాష్ట్ర వంటి గొప్ప రాష్ట్రానికి రాజ్య సేవక్‌గా లేదా రాజ్యపాల్‌గా సేవ చేయడం, సాధువులు, సంఘ సంస్కర్తలు, ధీర యోధుల భూమిగా పనిచేయడం నాకు ఒక సంపూర్ణ గౌరవం, ప్రత్యేకత' అని కోషియారీ పేర్కొన్నారు. 81 ఏళ్ల కోషియారీ 2019 సెప్టెంబరులో మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని మహా వికాస్ అఘాడి అధికారంలో ఉన్నప్పుడు, గవర్నర్ కోటా నుంచి రాష్ట్ర శాసన మండలికి 12 మంది సభ్యులను నియమించడంతో పాటు అనేక సమస్యలపై ప్రభుత్వంతో అనేక సార్లు చర్చలు జరిపారు. దానిని ఆయన ఆమోదించలేదు. పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఎంవీఏ ఆరోపించింది. ఇక కోషియారీని చుట్టుముట్టిన తాజా వివాదం ఛత్రపతి శివాజీ మహారాజ్‌పై 'పాత కాలపు చిహ్నం'గా అభివర్ణించిన ఆయన వ్యాఖ్యల గురించి. ఈ వ్యాఖ్యలపై ఆయనను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. గత జూన్‌లో శివసేన నాయకుడు ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటు కారణంగా ఏర్పడిన రాజకీయ సంక్షోభం నడుమ, కోషియారీ అప్పటి ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని ఎంవీఏ ప్రభుత్వానికి బలపరీక్షకు ఆదేశించారు.

ఇదీ లోకం!

జీవో1పై విచారణ నేటికి వాయిదా

వెకేషన్ బెంచ్ నిర్ణయాన్ని తప్పుబట్టిన సీజే

జీవో నం.1పై ఏపీ హైకోర్టులో విచారణ మంగళవారానికి వాయిదా పడింది. తాజా పిటిషన్లపై కూడా రేపు వాదనలు వింటామని ధర్మాసనం పేర్కొంది.

2లో

ఐటీ గగ్గోలు

- ఆర్థిక మాంద్యం భయంతో పెరుగుతున్న ఉద్యోగ కోతలు
- అమెరికాలో భారతీయులకు కష్టాలు
- గత ఏడాది నుంచి 2 లక్షల ఐటీ ఉద్యోగాల కోత
- 30-40 శాతం మంది భారత ఐటీ నిపుణులే
- తాజా కోతలతో ఆందోళనలో ఉద్యోగులు
- కొత్త ఉద్యోగం కోసం... వీసా స్టేటస్ మార్చుకునేందుకు తంటాలు

న్యూఢిల్లీ : రానున్న నెలల్లో ఆర్థిక మాంద్యం సంభవించ వచ్చనే ఆందోళనల నడుమ ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధికి ముప్పు ఏర్పడింది. అనేక రంగాల్లో ఉద్యోగాల కోతలు మొదలయ్యాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో ఈ పరిస్థితి మరింత ఊపందుకుంది. అమెజాన్, ట్విట్టర్, గూగుల్ వంటి

- మిగతా 2 లో

అండమాన్ దీవులకు పరమ్‌వీర్‌చక్ర గ్రహీతల పేర్లు

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ సోమవారం అండమాన్ నికోబార్‌లోని 21 దీవులకు 21 మంది పరమ్‌వీర్ చక్ర గ్రహీతల పేర్లు పెట్టారు. పరాక్రమ్ దివస్‌ను పురస్కరించుకొని, పేర్లు లేని వాటికి తాజాగా పేర్లు పెట్టారు. అలాగే నేతాజీ గౌరవార్థం ఒక జాతీయ స్మారకం నమూనాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా పాల్గొన్నారు. 'ఈ అండమాన్ గడ్డ మీదే మొదటిసారి మన త్రివర్ణపతాకం రెపరెపలాడింది. స్వతంత్ర భారత్‌కు చెందిన ప్రభుత్వం మొదట ఇక్కడే ఏర్పాటైంది. సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి. ఈ రోజును దేశం పరాక్రమ్ దివస్‌గా నిర్వహిస్తోంది. ఈ 21 మందికి దేశమే అన్నింటికంటే ముఖ్యం. ఈ పేర్లు పెట్టడం ద్వారా వారి తీర్మానం ఎప్పటికీ నిలిచి ఉంటుంది. అలాగే అండమాన్ అభివృద్ధి దిశగా ఎనిమిదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది' అని

- మిగతా 2 లో

నౌకాదళంలోకి ఐఎన్ఎస్ వగీర్

న్యూఢిల్లీ: భారత నౌకాదళంలోకి మరో జలాంతర్గామి చేరింది. ఐఎన్ఎస్ వగీర్‌ను నౌకాదళానికి అప్పగించే కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్ పాల్గొన్నారు. "ఈ సబ్‌మెరైన్‌తో భారత నౌకాదళ సామర్థ్యాలు మెరుగుపడతాయి. దేశ ప్రయోజనాలను ఇది శత్రువుల నుంచి కాపాడుతుంది. అంతేకాదు సంక్షోభ సమయంలో కీలకమైన నిర్ణయాత్మకమైన ఇంటెలిజెన్స్, నిఘా, పర్యవేక్షణలను అందిస్తుంది" అని నౌకాదళం ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రాజెక్టు 75 కింద నిర్మించిన ఐదో డీజిల్ ఎలక్ట్రిక్ సబ్‌మెరైన్ ఇది. 'వగీర్' అంటే షార్క్‌చేప. నిశ్శబ్దంగా, భయం లేకుండా పనిచేయడం దీని ప్రధాన సామర్థ్యం. ఈ పేరును 1973-2001 వరకు వినియోగించిన ఓ పాత సబ్‌మెరైన్ నుంచి తీసుకొన్నారు. ఈ కొత్త సబ్‌మెరైన్‌ను మాజిగావ్ డాక్ షిప్ బిల్డర్స్ నిర్మించింది. దీనికోసం ఫ్రాన్స్ నుంచి సాంకేతికత భారత్‌కు బదిలీ అయింది. ఈ సబ్‌మెరైన్‌లో ప్రపంచంలోనే అత్యుత్తమ సోనార్లను అమర్చారు. అంతేకాదు.. దీనిలో వైర్ గైడెడ్ టార్పిడోలు కూడా ఉన్నాయి. ఈ జలాంతర్గామి నుంచి సబ్ సర్ఫేస్ టూ సర్ఫేస్ క్షిపణులను ప్రయోగించవచ్చు. దీంతో ప్రత్యర్థి నౌకాదళంపై వేగంగా దాడి చేసే సామర్థ్యం లభిస్తుంది. స్పెషల్ ఆపరేషన్ల కోసం శత్రు స్థావరాల్లోకి మెరైన్ కమాండోలను పంపించే సామర్థ్యం ఈ జలాంతర్గామికి ఉంది. సముద్రం మధ్యలో, తీరాలకు అత్యంత సమీపంలో కూడా ఐఎన్ఎస్ వగీర్‌ను మోహరించవచ్చు. దేశీయంగా నిర్మించిన అత్యాధునిక సబ్‌మెరైన్లలో ఇదొకటి. దీనిని 2020 నవంబర్‌లోనే ఆవిష్కరించగా.. నాటి నుంచి ఫిబ్రవరి 2022 వరకు సముద్రంలో ఆయుధాలు, సోనార్లు సహా వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. గతంలో భారత్‌లో నిర్మించిన సబ్‌మెరైన్లు అన్నింటిలో వగీర్‌నే అత్యంత వేగంగా నిర్మించారు. భారత్‌లో మెరుగుపడుతున్న ఆత్మనిర్భర్‌కు ఇది ఉదాహరణగా నిలిచింది.

పరమ్‌వీర్‌చక్ర గ్రహీతల పేర్లు

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని వెల్లడించారు. ఆ దీవుల పేర్లు ఇలా ఉన్నాయి. లెఫ్టినెంట్ కల్నల్ ధనసింగ్ థాపా మరణం తర్వాత ఒక దీవికి ధన్‌సింగ్ పేరు, లెఫ్టినెంట్ కల్నల్ అర్దేషిర్ బుర్జోజి తారాపోర్ మరణం తర్వాత మరో దీవికితారాపోర్, లాన్స్ నాయక్ కరమ్ సింగ్ మరణం తర్వాత కరసింగ్ దీవిగా, నాయబ్ సుబేదార్ బనా సింగ్ మరణం తర్వాత బనా దీవిగా, లాన్స్‌నాయక్ అల్బర్ట్ ఎక్కా మరణం తర్వాత ఎక్కా దీవిగా, రెండో లెఫ్టినెంట్ అరుణ్ క్షేత్రపాల్ మరణం తర్వాత క్షేత్రపాల్ దీవిగా, లెఫ్టినెంట్ మనోజ్ కుమార్ పాండే మరణం తర్వాత పాండే దీవిగా, మేజర్ హోషియార్‌సింగ్ మరణం తర్వాత హోషియార్ దీవిగా, మేజర్ షైతన్ సింగ్ మరణం తర్వాత షైతన్ దీవిగా నాయక్ జాదూనాథ్ సింగ్ మరణం తర్వాత జాదూనాథ్ దీవిగా, సుబేదార్ మేజర్ యోగేందర్ సింగ్ యాదవ్ మరణం తర్వాత యోగేందర్ దీవిగా, కంపెనీ క్వార్టర్‌మాస్టర్ హవల్‌దార్ అబ్దుల్ హమీద్ మరణం తర్వాత హమీద్ దీవిగా, రెండో లెఫ్టినెంట్ రమ రగోబా రాణె మరణం తర్వాత రాణె దీవిగా, మేజర్ రామేశ్వరస్వామి పరమేశ్వరన్ మరణం తర్వాత రామేశ్వరస్వామి దీవిగా, కెప్టెన్ విక్రమ్ బాత్ర మరణం తర్వాత బాత్ర దీవిగా, సుబేదార్ జోగిందర్‌సింగ్ మరణం తర్వాత జోగిందర్ దీవిగా, కెప్టెన్ జీఎస్ సలారియా మరణం తర్వాత సలారియా దీవిగా, కంపెనీ హవల్దార్ మేజర్ పిరు సింగ్ మరణం అనంతరం పిరు దీవిగా, మేజర్ సోమనాథ్ శర్మ మరణం తర్వాత సోమ్‌నాథ్ దీవిగా, ఫ్లైయింగ్ ఆఫీసర్ నిర్మల్‌జిత్ సింగ్ షెకాన్ మరణం తర్వాత షెకాన్ దీవిగా, సుబేదర్ మేజర్ సంజయ్ కుమార్ మరణం తర్వాత సంజయ్ దీవిగా నామకరణం చేశారు.

సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్ బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలని ప్రతిపక్ష నేతలు అనేకసార్లు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన బదిలీ కావడం గమనార్హం. సునీల్‌కుమార్‌ను సాధారణ పరిపాలనశాఖలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించగా, ఈ బదిలీ సాధారణ అంతర్గత బదిలీల్లో భాగంగానే జరిగినట్లు అధికారపార్టీ నేతలు పేర్కొంటున్నారు. సీఐడీ అదనపు డీజీగా సీనియర్ ఐపీఎస్ అధికారి ఎన్.సంజయ్ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం విపత్తు నిర్వహణ డీజీగా విధులు నిర్వర్తిస్తున్నారు.

సర్కార్ కక్ష సాధింపు

(మొదటిపేజీ తరువాయి)

పడతారని, ఇప్పటికే రాష్ట్రంలో ఉద్యోగుల పరిస్థితి చాలా దారుణంగా ఉందని, 15వ తేదీ వరకు జీతాలు పడుతూనే ఉంటాయని, పెన్షన్ల పరిస్థితి అలాగే ఉందని తెలియజేశారు. జీతాలు 1వ తేదీ తప్పనిసరిగా ఇచ్చేలా చట్టం తీసుకురావాల్సిన అవసరాన్ని తెలియజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ వ్యవహారశైలిని, ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల చూపుతున్న నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. ఇవన్నీ పత్రికల్లో, మీడియాలో వచ్చిన వార్తల ఆధారంగా నోటీసులు జారీ చేస్తున్నట్లు నోటీసులో ప్రభుత్వం పేర్కొంది.

ఏ చర్యలు తీసుకున్న సిద్ధమే: సూర్యనారాయణ

ప్రభుత్వ నోటీసుపై స్పందించిన ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వమన్నారని, అన్ని విషయాలతో వివరణ ఇస్తామన్నారు. ప్రభుత్వం ఏ చర్యలు తీసుకున్న తాము సిద్ధమేనని స్పష్టం చేశారు. నిబంధనలు ఒక సంఘానికే పరిమితమవుతాయా? అని ప్రశ్నించారు. నోటీసుల్లో ఆర్థికపరమైన చెల్లింపులపై షెడ్యూల్ ఇస్తే బాగుండేదన్నారు. గవర్నర్ కూడా ప్రభుత్వంలో భాగమేనని సూర్యనారాయణ వ్యాఖ్యానించారు. కొన్ని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తమ గుర్తింపు రద్దు చేస్తామంటే ఆనందపడుతున్నారన్నారు. భవిష్యత్తులో ఇదే పరిస్థితి వాళ్లకు కూడా ఎదురవుతుందన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. నిబంధనలకు లోబడే గవర్నర్‌ను కలిశామని చెప్పారు. గవర్నర్‌కు ఎటువంటి ఫిర్యాదు చేయలేదని, తమ సమస్యలను పరిష్కరించమని మాత్రమే చెప్పామన్నారు. మీడియాతో మాట్లాడిన వారు అనేకమంది అనేక సంఘాల్లో ఉన్నారని, వాళ్లకు నిబంధనలు వర్తించవా? అని ప్రశ్నించారు.

అమెరికా పార్క్‌లో మారణహోమం సృష్టించిన వ్యక్తి ఆత్మహత్య

తుపాకీతో కాల్చుకుని మృతి: పోలీసుల వెల్లడి

లాస్‌ఏంజెల్స్ (అమెరికా): చైనా నూతన లూనార్ సంవత్సర వేడుకల్లో మారణహోమం సృష్టించి పది మందిని పొట్టనపెట్టుకున్న నిందితుడు మృతిచెందాడు. నిందితుడిగా అనుమానిస్తున్న 72 ఏళ్ల హుయుకెన్ ట్రాన్ ఆత్మహత్య చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ట్రాన్ ప్రయాణిస్తున్న వైట్ కలర్ వ్యాన్‌ను పోలీసులు చుట్టుముట్టడంతో అతను తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు వివరించారు. శనివారం లాస్‌ఏంజెల్స్‌లోని మాంటెరీ పార్క్‌లో చైనీయుల లూనార్ కొత్త సంవత్సర వేడుక జరుగుతుండగా మెషీన్ గన్తో వచ్చిన ఓ దుండగుడు విచక్షణా రహితంగా కాల్పులు జరిపి పది మందిని బలి తీసుకున్న సంగతి తెలిసిందే. కాల్పులకు తెగబడిన వ్యక్తిని హుయుకెన్‌గా ట్రాన్‌గా పోలీసులు గుర్తించారు. తెల్లరంగు వ్యాన్లో వచ్చిన ట్రాన్ ఈ మారణహోమానికి కారణమని అనుమానించి వాహనాన్ని వెంబడించారు. వ్యాన్‌ను పోలీసులు చుట్టుముట్టడంటతో ట్రాన్ తనను తాను కాల్చుకున్నాడని వివరించారు. రెండోసారి ట్రాన్ కాల్పులకు సిద్ధమవుతుండగా స్థానికులు అడ్డుకోవడంతో వెంటనే నిందితుడు వ్యాన్‌లో పారిపోయాడని తెలిపారు. ట్రాన్ ఈ దాడికి పాల్పడటానికి కారణం ఇంకా తెలియదని పోలీసులు వెల్లడించారు. ఈ దారుణ ఘటనలో ఇంకా అనుమానితులు ఎవరూ లేరని పేర్కొన్నారు. దుర్ఘటన జరిగిన 34 కిలోమీటర్ల దూరంలో నిందితుడి వ్యాన్‌ను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఆసియా వాసులు ఎక్కువగా నివసించే టోరెన్‌లో వ్యాన్ కనుగొనడం తొలుత తీవ్ర భయాందోళనలను కలిగించింది. ఇటు నిందితుడు ట్రాన్ ఆత్మహత్య చేసుకున్నప్పటికీ పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడికి మానసిక వ్యాధి ఉందా, గతంలో ఏమైనా హింసకు పాల్పడ్డాడా, గన్లను చట్టబద్ధంగానే పొందాడా, అక్రమ మార్గంలో వస్తే ఎక్కడి నుంచి వచ్చాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు కాల్పులు జరుపుతున్నప్పుడు పోలీసులు ఆలస్యంగా స్పందించారన్న విమర్శలను పోలీసులు ఖండించారు. ఫోన్ వచ్చిన మూడు నిమిషాల్లోనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారని మాంటెరీ పార్క్ పోలీస్ చీఫ్ స్కాట్ వైస్ తెలిపారు. అమెరికాలో ఈ నెలలోనే అయిదోసారి కాల్పులు జరగడం తీవ్ర కలకలం రేపుతోంది. ప్రజలు వేడుకల్లో పాల్గొనాలంటేనే భయపడే పరిస్థితులు వస్తున్నాయి. గత ఏడాది మే 24న టెక్సాస్‌లోని ఉవాల్డేలో ఉన్న ఒక ప్రాథమిక పాఠశాలలో 21 మంది మరణించిన తర్వాత ఇది అత్యంత ఘోరమైన దాడి.

టర్కీలో మే14న అధ్యక్ష ఎన్నికలు

అంకారా: అధ్యక్ష ఎన్నికలు మే14వ తేదీన జరుగుతాయని టర్కీ అధ్యక్షుడు రెసప్ తయ్యిప్ ఎర్డోగాన్ ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం అధ్యక్ష, పార్లమెంటరీ ఎన్నికలు జూన్ 18న జరగాల్సి ఉండగా, పరీక్షలు, వ్యవసాయ పనులు వంటి కాలానుగుణ పరిస్థితుల కారణంగా ముందస్తుగా నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. బుర్సా ప్రావిన్స్‌లో శనివారం జరిగిన యువజన సదస్సులో ఎర్డోగాన్ మాట్లాడుతూ... మే 14న జరిగే ఎన్నికల్లో మీరు మొదటి సారిగా ఓటు వేస్తారన్నారు. ఇవి ముందస్తు ఎన్నికలు కావని, వాటిని ముందుకు తీసుకువచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి సంబంధించిన వీడియో ఆదివారం మీడియాలో విడుదలైంది.

నేషనలిస్ట్ యాక్షన్ పార్టీ నేత డెవ్లెట్ బహ్సెలీ, పాలక జస్టిస్ అండ్ డెవలప్‌మెంట్ పార్టీతో కలిసి జనవరి 17న పీపుల్స్ అలయన్స్ సంకీర్ణ కూటమిని ఏర్పరిచిన సంగతి తెలిసిందే. రాబోయే ఎన్నికల్లో కూటమి తరఫున అధ్యక్ష అభ్యర్థిగా ఎర్డోగాన్‌ను ప్రకటించినట్లు బహ్సెలీ పేర్కొన్నారు. ప్రతిపక్ష కూటమి ఇంకా అధ్యక్ష అభ్యర్థిని ప్రకటించలేదు. ఎర్డోగాన్ మరోసారి అధ్యక్షుడిగా ఎన్నికవ్వాలని ఆకాంక్షిస్తున్నారు.

పాక్‌లో నిలిచిన విద్యుత్ సరఫరా

ఇస్లామాబాద్: ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాకిస్తాన్ అంతకంతకూ దయనీయంగా మారుతోంది. ఇప్పటికే గోధుమ పిండి కొరతతో సతమతమవుతున్న పాక్‌లో సోమవారం ఉదయం 7.30 గంటల నుంచి దేశంలోనే అనేక ప్రధాన నగరాలకు గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌మిషన్‌లో లోపాల వల్ల ఈ అంతరాయం కలిగిందని అధికారులు తెలిపారు. కరాచి, లాహోర్ లాంటి ప్రధాన నగరాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పటినట్లు పాకిస్తాన్‌కు చెందిన స్థానిక మీడియా తెలిపింది. 'పాకిస్తాన్‌లోని అనేక ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఈ సమస్య ఎందుకు వచ్చిం దో, ఎక్కడ అంతరాయం కలిగిందో తెలుసుకుంటున్నాం. ఈ సమస్యను పరిష్కరిస్తాం' అని విద్యుత్ అధికారులు ట్విట్టర్‌లో వెల్లడించారు. గుడ్డు నుంచి క్వెట్టాకు రెండు ట్రాన్స్‌మిషన్లలో విద్యుత్ సమస్య తలెత్తిందని అధికారులు తెలిపారు. క్వెట్టా సహా బలూచిస్తాన్‌లోని 22 జిల్లాల్లో విద్యుత్ సరఫరా లేదని పేర్కొన్నారు. దేశంలో విదేశీ మారక నిల్వలు పడిపోవడం వల్ల పాక్ తీవ్ర ఆర్థిక సవాళ్లను ఎదుర్కొం టోంది. పాకిస్తాన్ ఈ నెలలో కొత్త ఇంధన పరిరక్షణ ప్రణాళికను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. గత ఏడాది అక్టోబరులో పాకిస్తాన్ విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని ఎదుర్కొంది. దీనివల్ల దేశంలోని పెద్ద ప్రాంతాలు, ప్రావిన్షియన్షిల్ రాజధానులు కరాచీ, లాహెూర్‌లో 12 గంటలకు పైగా విద్యుత్ అంతరాయం కలిగింది.

జీవో1పై విచారణ నేటికి వాయిదా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జీవో నం.1పై ఏపీ హైకోర్టులో విచారణ మంగళవారానికి వాయిదా పడింది. తాజా పిటిషన్లపై కూడా రేపు వాదనలు వింటామని ధర్మాసనం పేర్కొంది. రహదారులపై ర్యాలీలు, సభలపై నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 1 జారీ చేసింది. అయితే జీవో నంబర్ 1ను రద్దుచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హైకోర్టును ఆశ్రయించగా, దానిపై హైకోర్టు స్టే విధించిన విషయం తెల్సిందే. 1861 పోలీసు చట్టంలోని 30వ సెక్షన్‌లో పేర్కొన్న విధివిధానాలకు ఈ జీవో విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. జీవో అమలును ఈ నెల 23 వరకు సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈలోగా రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సంక్రాంతి సెలవుల్లో వెకేషన్ బెంచ్ నిబంధనలకు విరుద్ధంగా ఈ కేసును అత్యవసరంగా స్వీకరించి స్టే విధించిందని, అందువల్ల స్టేను ఎత్తివేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దీనిపై సుప్రీం జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తూ హైకోర్టు 23వ తేదీ దీనిపై విచారిస్తుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో సోమవారం హైకోర్టు విచారణ చేపట్టగా, ఇరుపక్షాలు వాదనలు వినిపించాయి. ఈ సందర్భంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. వెకేషన్ బెంచ్ డీఫాక్టో చీఫ్ జస్టిస్‌లా వ్యవహరించిందని, ఈ కేసును స్వీకరించడం ద్వారా వెకేషన్ బెంచ్ తన పరిధిని మించి వ్యవహరించదని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రతి కేసు ముఖ్యమైనదేనని భావించుకుంటూ వెళ్తే హైకోర్టు ఏమైపోవాలని అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటివి జరిగితే ప్రతి వెకేషన్ జడ్జి చీఫ్ జస్టిస్ అయిపోయినట్లేనని వ్యాఖ్యానించారు. పిటిషన్ మూలాల్లోకి వెళ్లి చూస్తే అంత ఎమర్జెన్సీ కూడా అనిపించలేదని, ఈ కేసు గురించి, దాని మూలాల గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నానని హైకోర్టు చీఫ్ జస్టిస్ అన్నారు. తనకేమీ తెలియదని అనుకోవద్దని, రిజిస్ట్రీ ఎప్పటికప్పుడు తనకు నివేదించిందని తెలిపారు. హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా తన అధికారాలను పూర్తిగా వినియోగిస్తానని జస్టిస్ స్పష్టం చేశారు. తన పిటిషన్ స్వీకరించాలంటూ వెకేషన్ కోర్టు ముందు ధర్నా జరిగిందా ? అంత అర్జెంటుగా వెకేషన్ బెంచ్‌లో లంచ్ మోషన్ ఎందుకు వేశారు ? అని ప్రశ్నించారు. ఎలాంటి అత్యవసరం లేనప్పుడు లంచ్ మోషన్ వేయాల్సిన అవసరమేంటని ప్రశ్నిస్తూ...విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

రేపు క్రిస్ బాధ్యతల స్వీకారం

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ కొత్త ప్రధానిగా క్రిస్ హిప్‌కిన్స్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇంతకాలం ప్రధానిగా ఉన్న జెసిండా ఆర్డెన్ రాజీనామా చేస్తున్నట్టు గురువారం ప్రకటించిన సంగతి విదితమే. దీంతో అధికార లేబర్ పార్టీ ప్రతినిధులు ఆదివారం సమావేశమై పార్టీ కొత్త నాయకుడిగా, దేశానికి 41వ ప్రధానిగా క్రిస్ హిప్‌కిన్స్‌ను ఎన్నుకున్నారు. బుధవారం ప్రధానిగా బాధ్యతలు స్వీకరిస్తానని క్రిస్ హిప్‌కిన్స్ తెలిపారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న అధిక ద్రవ్యోల్బణం, గృహాల అధిక ధరలు వంటి సమస్యలతో పాటు శాంతిభద్రతలపై దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది అక్టోబరు 14న న్యూజిలాండ్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి.

నిరంతర పోరు

(మొదటిపేజీ తరువాయి)

దేశాల ప్రజలు క్యూబాకు తమవంతు సంఘీభావం ప్రకటిస్తున్నారని, అది తనకు ఎంతో గర్వకారణంగా ఉందని చెప్పారు. సంఘీభావం మానవతా విలువులతో కూడుకున్నదనీ, మానవతా సందేశమే సంఘీభావానికి ఊపిరన్నారు. క్యూబా వ్యాప్తంగా తమ దేశ ప్రజలు అత్యంత చైతన్యవంతంగా ఉంటారని, ప్రపంచశాంతికి తమ వంతు నిర్మాణాత్మకమైన కృషి చేస్తారని పేర్కొన్నారు. ప్రజారోగ్యం అనేవీ అత్యంత ప్రాధాన్యత అంశమని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో ఉండేలా అన్ని విధాలా చూడాలన్నారు.

సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతుగా క్రియాశీలకపాత్ర పోషించారని, తాను ఎంచుకున్న వైద్యవృత్తి సమాజానికి సేవచేయడంతోపాటు అంకితభావంతో విస్తృతస్థాయి సేవలందించేలా తన దృష్టి కోణాన్ని మార్చిందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమానికి భాషలు, సరిహద్దులు అడ్డుగోడలు కారాదనీ, విశ్వవ్యాప్తంగా ప్రేమ, ఆత్మీయతానురాగాలు ఇచ్చిపుచ్చుకోవాలని ఆమె కోరారు. చేగువేరా వారసులం కావడం తమకు గర్వకారణమే అయినప్పటికీ...ప్రపంచ వ్యాప్తంగా చే గువేరా అభిమానులు కోట్ల సంఖ్యలో ఉండటం తమకు అత్యంత ఆనందాన్ని కలిగిస్తోందని చెప్పారు. విప్లవ పోరాటాల ద్వారా ప్రజా సంక్షేమం కోసం పాటుపడేవారే తన తండ్రికి నిజమైన వారుసులని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా అర్జెంటీనా భాషలోని ఒక కవితను ఆమె విన్పించారు. ఒక వ్యక్తి చనిపోతే ఎవ్వరూ ఏడ్వవద్దు అనీ, కానీ ఆ వ్యక్తి చనిపోయినందుకు జీవితానికి ఒక సార్థకత ఉండాలని, అప్పుడే జనం మధ్య వ్యక్తి బ్రతుకుతారంటూ కవిత సారాంశాన్ని వివరించారు. విద్యా, వైద్య రంగాలపై దేశ వ్యాప్తంగా మనం నిరంతరం ఉద్యమించాలని సూచించారు. 'నేను' అనే పదం కంటే...'మేము' అనే పదాన్ని వినియోగిస్తే బాగుంటుందన్నారు.

ఇతరుల మాటలను మనం ఎప్పుడూ వింటూ ఉండాలని చెప్పారు. సమానత్వంపై మనం నిరంతరమూ పోరాడాలని, సాంస్కృతిక, రంగు, లింగ విభేదాల్ని పారద్రోలాలన్నారు. చే గువేరా ఆశయాలు, ఆదర్శాలను ఆచరణలో ముందుకు తీసుకెళ్లేందుకు మనమంతా ఐక్యంగా కృషి చేద్దామన్నారు. సభ ప్రారంభానికి ముందు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పి.చంద్రనాయక్, చిన్నం పెంచలయ్య, నాయకులు ఆర్.పిచ్చయ్య, నాజర్ తదితరులు అభ్యుదయ గేయాలను ఆలపించారు. విద్యార్థినులు నృత్యాలు ప్రదర్శించారు. వేదికపైన డాక్టర్ అలైదా గువేరా , ప్రొఫెసర్ ఎస్తేఫానియా గువేరా (చేగువేరా మనుమరాలు)ను ఆహ్వాన సంఘం సభ్యులు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి సత్కరించారు. గన్నవరం విమానాశ్రయంలో అలైదా గువేరా, ఎస్తేఫానియా గువేరాకు ఆహ్వాన సంఘం కమిటీ సభ్యులతోపాటు వామపక్ష, ప్రజా సంఘాల నేతలు ఘనంగా స్వాగతం పలికారు.

ఐటీ గగ్గోలు

(మొదటిపేజీ తరువాయి)

అనేక ఐటీ కంపెనీలు తమ ఉద్యోగులను ఇంటికి సాగనంపుతున్నాయి. పెద్ద సంఖ్యలో లేఆఫ్‌లను ప్రకటిస్తున్నాయి. ఈ ప్రభావం భారతదేశంపై కూడా తీవ్రంగానే ఉంది. ముఖ్యంగా అమెరికాలో వివిధ ఐటీ కంపెనీల్లో పని చేస్తున్న భారతీయులకు ఈ కష్టాలు అధికమయ్యాయి. అమెజాన్‌లో పని చేస్తున్న లత మూడు నెలల క్రితమే అమెరికాలో అడుగుపెట్టింది. ఇటీవల లేఆఫ్‌ల్లో భాగంగా మార్చి 20న ఆమె చివరి వర్కింగ్ డే అని చెప్పారు. హెచ్-1బీ వీసాతో అగ్రరాజ్యానికి వెళ్లిన ఆమె, ఇప్పుడు 60 రోజుల్లోగా కొత్త ఉద్యోగం వెతుక్కోవాల్సిందే. లేదంటే స్వదేశానికి తిరిగివెళ్లడం తప్ప మరో అవకాశం లేదు. హెచ్-1బీ వీసాతో మైక్రోసాఫ్ట్‌లో ఉద్యోగం చేస్తున్న కమలిని జనవరి 18న లేఆఫ్‌కు గురైంది. ఒంటరి తల్లి. కొడుకు త్వరలోనే కళాశాలలో చేరబోతున్నాడు. ఈ సమయంలో ఉద్యోగం కోల్పోవడంతో పరిస్థితి చాలా క్లిష్టంగా మారింది. వీరిద్దరే కాదు, అమెరికాలో ఉంటున్న వేలాది మంది భారతీయ ఐటీ నిపుణులు ఇప్పుడు ఎదుర్కొంటున్న సమస్య ఇది..! ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో ఖర్చులను తగ్గించుకునేందుకు అమెరికాలోని టెక్ కంపెనీలు కోతల బాటపట్టాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, అమెజాన్‌లాంటి దిగ్గజ సంస్థలు సహా అమెరికాలో అనేక టెక్ కంపెనీలు ఇటీవల వేలాదిగా ఉద్యోగుల కోతలు ప్రకటించాయి. వాషింగ్టన్ పోస్ట్ కథనం ప్రకారం... గత ఏడాది నవంబరు నుంచి ఇప్పటివరకు దాదాపు 2 లక్షల మంది ఐటీ సిబ్బంది ఉద్యోగాలు కోల్పోయారు. ఇందులో 30 నుంచి 40 శాతం మంది భారత ఐటీ నిపుణులే. వీరిలో మెజార్టీ ఉద్యోగులు హెచ్-1బీ, ఎల్1 వీసాలతో అమెరికాలో ఉంటున్నారు. దీంతో అగ్రరాజ్యంలోనే ఉండేందుకు ఇప్పుడు వీరంతా ప్రత్యామ్నాయాలు అన్వేషించక తప్పట్లేదు. గడువులోగా కొత్త ఉద్యోగం వెతుక్కోవడం లేదా.. వీసా స్టేటస్‌ను మార్చుకునేందుకు వీరు తంటాలు పడుతున్నారు. 'వేలాది మంది టెక్ ఉద్యోగులు లేఆఫ్‌లను ఎదుర్కోవడం చాలా దురదృష్టకరం. ముఖ్యంగా హెచ్-1బీ వీసాదారులకు మరిన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. వీరు విధుల నుంచి తొలగిపోయిన 60 రోజుల్లోగా కొత్త ఉద్యోగాన్ని సంపాదించాలి. లేదంటే వీసాను మార్చుకోవాలి. దీంతో ఈ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల హెచ్-1బీ వీసాదారులకు టెక్ కంపెనీలు కొన్ని మినహాయింపులు ఇస్తే బాగుంటుంది. ప్రస్తుతం జాబ్ మార్కెట్లో ఉన్న సమస్యల కారణంగా వీరి టెర్మినేషన్ తేదీని కొన్ని నెలలు పొడిగించాలి' అని సిలికాన్ వ్యాలీకి చెందిన ఎంటర్‌ప్రెన్యూర్ అజయ్ జైన్ భుటోరియా అభిప్రాయపడ్డారు. అమెరికా టెక్ పరిశ్రమలో అధిక మొత్తంలో ఉద్యోగులు భారత వలసదారులే. దీంతో లేఆఫ్‌ల్లోనూ వీరే ఎక్కువ మంది ఉన్నారు. అమెరికా నిబంధనల ప్రకారం, హెచ్-1బీ వీసాదారులు లేఆఫ్‌లో ఉద్యోగం కోల్పోతే 60 రోజుల్లోగా కొత్త ఉద్యోగం వెతుక్కోవాలి. లేదంటే ఆ గడువు దాటిన 10 రోజుల్లోగా అమెరికా నుంచి వెళ్లిపోవాల్సి ఉంటుంది.

ఆపాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు మనందరి హక్కు అని, ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు. ఈ దీక్షలో పాల్గొని మద్దతు తెలిపిన మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర నాయకులు బండారు సత్యనారాయణ మూర్తి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, సీపీఎం పెందుర్తి ఏరియా కార్యదర్శి బి రమణి, సీపీఐ ఎంఎల్ఎన్‌డి నాయకురాలు కె నిర్మల తదితరులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతు లేకపోయినా, సొంత గనులు కేటాయించకపోయినా 35 వేల మంది పర్మినెంట్ కార్మికులకు ప్రత్యక్షంగా, లక్ష మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తూ, 50 వేల కోట్ల రూపాయలు పన్నులు కడుతున్నారన్నారు. కేవలం 5 వేల కోట్ల రూపాయల మూలధనంతో ఇంత అభివృద్ధిలో నడుస్తున్న ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేస్తామని బీజేపీ ప్రభుత్వం ప్రకటన చేసి జనవరి 27 కి రెండు సంవత్సరాల పూర్తవుతుందని, ఈ సందర్భంగా జనవరి 30న ఉక్కు నగరంలో నిర్వహించే కార్మిక గర్జనలో విశాఖ జిల్లా ప్రజలు పాల్గొని నిరసన తెలిపి, కార్మికులకు అండగా ఉండాలని కోరారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం కూడా అన్ని పరిశ్రమలను అమ్మే పనిలో ఉందని, ఇప్పటికే గంగవరం, కృష్ణపట్నం వంటి వాటిని అమ్మేసిందని అన్నారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ప్రధాని దగ్గరకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని వారు డిమాండ్ చేశారు. .సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ దీక్ష శిబిరంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ విమల, ఎస్ కె రెహమాన్, కె సత్యనారాయణ, వై రాంబాబు, ఎన్ ఆసిరినాయుడు, సిపిఎం నాయకులు సూర్య ప్రకాష్, సిపిఐ ఎం ఎల్ ఎన్ డి యు ఇందిర ,వెంకట లక్ష్మీ, రూప, జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ బల్లా శ్రీనివాస్, రెడ్డి నారాయణరావు, వేగి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

27న మహాగర్జనకు తరలిరండి-జంగాల అజయ్‌కుమార్

విశాఖ ఉక్కు పరిరక్షణకు ఈ నెల 27న విశాఖ నగరంలో జరగనున్న మహాగర్జనను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. దానికి మద్దతుగా జనవరి 24వ తేదీన తెనాలి, మంగళగిరి, పొన్నూరు నియోజకవర్గాల వారు తెనాలి రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు సామూహిక నిరాహార దీక్షలు చేపట్టడం జరుగుతుందని, 25న గుంటూరు, తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల వారు గుంటూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉదయం నుంచి సాయంత్రం వరకు సామూహిక నిరాహార దీక్షలు చేపటనున్నట్లు తెలిపారు. సోమవారం తెనాలి గాంధీనగర్ సీపీఐ కార్యాలయంలో జరిగిన సీపీఐ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు.

కేంద్రం దిగిరాకుంటే ఉద్యమం ఉధృతం-కేవీవీ ప్రసాద్

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ పల్నాడు జిల్లా నర్సరావుపేట పట్టణంలోని గాంధీ పార్కు వద్ద దీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని,లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు, టీఎన్‌టీయూసీ నాయకులు గొట్టిపాటి జనార్థన్, ఏఐటీయూసీ నాయకులు కాసా రాంబాబు, కౌలు రైతు సంఘం నాయకులు రాధాకృష్ణ, రైతు సంఘం జిల్లా నాయకులు ఉలవలపూడి రాము, గోపాలరావు, సీఐటీయూ జిల్లా నాయకులు డి.శివకుమారి, ఏఐటీయూసీ నాయకులు బూదాల శ్రీనివాసరావు, మునుగోటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎన్టీఆర్ జిల్లా పరిధిలో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యాన మైలవరం, తిరువూరు పట్టణాల్లో నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ శిబిరాలను సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బుడ్డి రమేష్, సీహెచ్ దుర్గా కోటేశ్వరరావు, తిరువూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి తూము కృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు, షేక్ నాగుల్ మీరా, కొత్తపల్లి సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడులో: విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ సీపీఐ, ఏఐటీయుసి చేపట్టిన దీక్షలకు సంఘీభావంగా సోమవారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, ఏఐటియుసి కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని రామారావు, ఏఐటీయుసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, సీపీఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ భీమవరం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఏఐటీయూసీ భీమవరం ఏరియా కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, సికిలే పుష్పకుమారి, జిల్లా సమితి సభ్యులు నామాన వెంకటేశ్వరరావు తదితరులుపాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో: రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరాహారదీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ జిల్లాలో: కాకినాడ జిల్లా పెద్దాపురంలో సోమవారం రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం ఎదుట సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఏఐటీయూసీ సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి సత్యనారాయణ (పీఎస్), సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ ప్రారంభించారు.

జులైకల్లా రోడ్లు బాగు పడాలి

ఆర్అండ్‌బీ సమీక్షలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జులై నాటికి రాష్ట్రంలోని అన్ని రోడ్లను అభివృద్ధి చేసే ప్రక్రియ పూర్తి కావాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. ఆర్ అండ్ బీ శాఖపై సోమవారం క్యాంపు కార్యాలయంలో సీఎం సమీక్షించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ఉన్న రోడ్లను పూర్తిగా బాగు చేయాలని, కొత్తగా వేస్తున్న రోడ్లను నాణ్యతతో వేయాలని ఆదేశించారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత మరలా రెండేళ్లకే రిపేర్లకు వచ్చే అవకాశం ఉండకూడదన్నారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, గుంటూరు వంటి జిల్లాల్లో నేల స్వభావం రీత్యా రోడ్లు త్వరగా పాడైపోతున్నాయని, భారీ వాహనాలు తిరిగే సరికి కుంగిపోతున్నాయని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఇలాంటి చోట్ల ఫుల్ డెప్త్ రిక్లమేషన్ (ఎఫ్‌డీఆర్) టెక్నాలజీ వినియోగిస్తే రోడ్లు ఎక్కువకాలం మన్నికగా ఉంటాయని చెప్పగా, సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మొదటి దశలో వేయి కిలోమీటర్ల మేర ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో చేపట్టాలని, జులై నాటికి రోడ్లతోపాటు, అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిలను కూడా ఎట్టిపరిస్థితుల్లో పూర్తిచేయాలని సీఎం స్పష్టం చేశారు. అలాగే కడప, బెంగళూరు రైల్వేను లైను, విశాఖ నుంచి భోగాపురానికి వెళ్లే రోడ్డు నిర్మాణంపైనా దృష్టిపెట్టాలన్నారు. రోడ్లు బాగు చేసిన తర్వాత నాడు-నేడు ద్వారా ప్రజల ముందు పెట్టాలని, అన్ని ప్రభుత్వ శాఖల్లో నాడు- నేడు శీర్షిక కింద మనం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల ముందు ఉంచాలన్నారు. ఆయా ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లలో కూడా ఈ వివరాలు పొందుపర్చాలని చెప్పారు. పట్టణాలు, నగరాల్లో ఎప్పటికప్పుడు రోడ్ల రిపేర్లను చేసేందుకు ఉద్దేశించిన ఏపీసీఎంఎంఎస్ యాప్‌ను ఈ సమావేశంలో సీఎం ప్రారంభించారు. ఉపముఖ్యమంత్రి (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ) బూడి ముత్యాల నాయుడు, ఉపముఖ్యమంత్రి (గిరిజన సంక్షేమశాఖ) పీడిక రాజన్న దొర, ఆర్ అండ్ బి మంత్రి దాడిశెట్టి రామలింగేశ్వరరావు (రాజా), పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఆర్థికశాఖ కార్యదర్శి కే వి వి సత్యనారాయణ, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, రవాణాశాఖ కార్యదర్శి పీ ఎస్ ప్రద్యుమ్న, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

ఉద్యమం ఉధృతం

విశాలాంధ్ర-గాజువాక: ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని రాజకీయ ఉద్యమంగా ఉధృతం చేస్తామని, జనవరి 30న జరిగే ఉక్కు ప్రజా గర్జనలో ప్రజలు వేలాదిగా పాల్గొనాలని సోమవారం గాజువాకలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని, దీనిని తిప్పికొట్టా లంటే పునాదులు దెబ్బ కొట్టే విధంగా ఉద్యమ నిర్మాణం జరగాలన్నారు. ఆ దిశగా ఉద్యమ కార్యాచరణను రూపొందించడం కోసం స్థానిక ప్రజా ప్రతినిధులతో ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించి తద్వారా ఉద్యమ కార్యాచరణను రూపొందించాలని సూచించారు. ఇప్పటికే అనేక రూపాల్లో కార్మికులు ఉద్యమాన్ని నిర్వహిస్తున్నారని వారికి సహకారంగా ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధి పాల్గొంటు న్నారని ఆయన వివరించారు. నేడు ప్రత్యక్ష కార్యాచరణలోకి రావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దిశగా ప్రతి ఒక్క కార్పొరేటర్ తమ కార్యక్రమాలను రూపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు మాట్లాడుతూ ప్రజా జీవన ప్రమాణాలకు మూలాధారమైన విశాఖ ఉక్కు కర్మాగారంపై కేంద్ర వైఖరికి వ్యతిరేకంగా ఉద్యమాలను నిర్వహించాలని ఆయన అన్నారు. అందుకే ఈ ఉద్యమాన్ని మలిదశ ఉద్యమంగా మార్చడం కోసం జనవరి 30న జరిగే ఉక్కు ప్రజాగర్జనలో ప్రజలు వేలాదిగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. 72వ వార్డు కార్పొరేటర్ ఏ జె స్టాలిన్ మాట్లాడుతూ నేడు కేంద్ర ప్రభుత్వం, నాటి ప్రధానులు అనుసరించిన మిశ్రమ ఆర్థిక వ్యవస్థను బలహీనపరిచి ఆర్ఎస్ఎస్ విధానాలను అమలు చేస్తున్నారని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను మరింత బలపరిచి ప్రజా ఉద్యమాలుగా తీవ్ర రూపం దాల్చాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక కార్పొరేటర్లు గంధం శ్రీను, కాకి గోవింద రెడ్డి, మొల్లి ముత్యాల నాయుడు, బొండా జగన్, లేళ్ల కోటేశ్వరరావు, రౌతు శ్రీనివాసరావు, పల్లా శ్రీను, ఉరికోటి చందు, బొడ్డు నరసింహ పాత్రుడు, తిప్పల వంశీ రెడ్డి, మహమ్మద్ ఇమ్రాన్, దల్లి గోవిందరెడ్డి మాట్లాడుతూ నేటి వరకు ప్రజాప్రతినిధులుగా ఉద్యమాలకు సహకరిస్తున్నామన్నారు. నేడు ఈ ఉద్యమాన్ని మలిదశలోకి తీసుకు వెళ్లడం కోసం జరుగుతున్న ప్రజా ఉద్యమంలో ప్రజలను సమేకం చేయడం కోసం కృషిని కొనసాగిస్తామని వారు హామీ ఇచ్చారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్య రామ్ మాట్లాడుతూ నేడు కేంద్ర ప్రభుత్వం పరిశ్రమ ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపించే విధంగా కట్టడి చేస్తోందన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు కె సత్యనారాయణరావు, నీరుకొండ రామచంద్రరావు, మరిడయ్య, గణపతి రెడ్డి, డీవీ రమణారెడ్డి, విళ్ల రామ్మోహన్ కుమార్, బొడ్డు పైడిరాజు, సీహెచ్ సన్యాసిరావు, వరసాల శ్రీనివాస్, జీఆర్‌కే నాయుడు, మహాలక్ష్మి నాయుడు, మంగ వెంకట్రావు, కామేశ్వరరావు, సురేశ్ బాబు, కారు రమణ, కరణం సత్యారావు, సమ్మి సింహాద్రి, వీ శ్రీనివాసులు నాయుడు, వీవీ రమణ, శ్రీనివాసులు రెడ్డి, వీ ప్రసాద్ కాంట్రేకులు గోవిందు, పెద్దిరెడ్డి ప్రకాశ్ రావు, ఎలమంచిలి రాజేష్, వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో

అనంతపురంలో

వైసీపీది ప్రచార ఆర్భాటమే!

- టిడ్కో, జగనన్న కాలనీలే నిదర్శనం
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఈశ్వరయ్య
- ఇళ్ల నిర్మాణం కంటే మౌలిక వసతులు ముఖ్యం: జగదీశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ ప్రభుత్వానికి ప్రచార ఆర్భాటమే తప్ప ప్రజల ఇబ్బందులు ఏమాత్రం పట్టవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య మండిపడ్డారు. ఊళ్లకు ఊళ్లే నిర్మిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, మూడేళ్లలో ఐదు ఇళ్లు కూడా కట్టలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఈ విషయం పార్లమెంటు సాక్షిగా కేంద్ర ప్రభుత్వమే వెల్లడించిందని గుర్తు చేశారు. సీపీఐ పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం విజయనగరం నియోజక వర్గంలో జగనన్న కాలనీలను సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ విజయనగరం నియోజకవర్గంలోని గుంకాలం, కొండకరకాం గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పుట్టెడు సమస్యలతో పునాదుల్ని మించి ముందుకు సాగకుండా అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించి నిర్మాణ వ్యయాన్ని 1.8 నుండి 5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో లబ్ధిదారులు అప్పులపాలు కావడం తప్ప ఒరిగేదేమీ ఉండదన్నారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు తక్షణమే స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై సీపీఐ దశల వారి పోరాటం చేస్తూ ఈనెల 30 వరకు సంతకాల సేకరణ చేపట్టిందని, ఫిబ్రవరి 6న జిల్లా స్థాయి సదస్సులు, ఫిబ్రవరి 22న రాష్ట్ర స్థాయి సదస్సు విజయవాడలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, బుగత అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యులు బాయి రమణమ్మ, బుగత పావని, ఎన్. నాగభూషణం, జిల్లా సమితి సభ్యులు పొందూరు అప్పలరాజు, సంకురుభుక్త సునీల్, పురం అప్పారావు, కార్యకర్తలు వెలగాడ రాజేష్, పి. గౌరీశంకర్, వి.కొండలరావు, రామలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో

పేదోడి సొంతింటి కల నెరవేరేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని ప్రతి ఇంటికి 5 లక్షల రూపాయలు ఇవ్వడంతోపాటు, మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం అనంతపురం రూరల్ మండల పరిధిలోని కందుకూరు గ్రామ పంచాయతీ లో జగనన్న కాలనీ స్థలాలను పరిశీలించారు. లబ్ధిదారులతో కలిసి జగనన్న ఇళ్ల నిర్మాణాలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు.ప్రభుత్వం ఇచ్చే లక్షా ఎనభై వేలతో ఇల్లు నిర్మించుకోలేమని లబ్ధిదారులు తేల్చి చెప్పారు. దీంతో వారినుంచి అర్జీలను సేకరించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక కంకర, సిమెంటు, ఇనుము ఇతర ముడిసరుకు ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో జగనన్న ఇంటి నిర్మాణానికి రూ.లక్షా ఎనభై వేలు చాలదన్నారు.ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం 5 లక్షల రూపాయలు ఇవ్వాలని, ముందస్తుగా కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీల లేఅవుట్ ఏర్పాటు చేసి మూడున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు రోడ్లు, నీటి వసతి, విద్యుత్ సౌకర్యం లేకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమం లో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామక్రిష్ణ,సహాయ కార్యదర్శి నాగరాజు,రూరల్ మండల కార్యదర్శి రమేష్, రాప్తాడు మండల కార్యదర్శి రవీంద్ర, రూరల్ మండల సహాయ కార్యదర్శి నరేష్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రాకెట్ల రాము, కందుకూరు శాఖ కార్యదర్శి నల్లప్ప,సహాయ కార్యదర్శి రాము, నాయకులు బ్రహ్మయ్య, రామాంజినేయులు, శివయ్య, మధు, పుల్లన్న, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో

పేదల సొంత ఇంటి కలను నిజం చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టిన టిడ్కో ఇళ్లను అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు స్వాధీనపర్చాలని సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు కే.వీ.భాస్కరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలి, జగనన్న ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారుల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం సోమవారం సింగ్‌నగర్ ప్రాంతంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ 58వ డివిజన్ కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి ఎం.గుర్నాథం, నాయకులు పి.నాగరాజు, జె.శంకర్, ఎస్‌కే.రహీమ్, ఎస్‌కె. నాగూర్‌బీ, కన్నమ్మ. బి రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-నరసరావుపేట కలెక్టరేట్: పల్నాడు జిల్లాలో ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటల నష్టపోయిన రైతులు అందరికీ నష్టపరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం మాచవరంలో రైతులతో కలిసి ఆ గ్రామంలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. గ్రామంలో బొబ్బర, తామర వైరస్‌తో మిరప తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయని అనేక వెరైటీలు ఖరీదు ఎక్కువైనా తెచ్చి మిర్చి నారును నాటారని, ఈ వైరస్ వల్ల పూత, పిందె రాకపోవడంతో ఖరీదైన మందులు వాడామని అయినా లాభం లేక పోవడంతో కొంతమంది రైతులు మిరప తోటలు తొలగించారన్నారు. ఉన్న తోటల్లో కూడా ఈ వైరస్ ఎక్కువగా ఉందని ఎన్ని మందులు వాడినా లాభం లేదా అని రైతులు రైతు సంఘం నాయకుల వద్ద తమ ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన వరి పంట మాండోస్ తుపాను వల్ల వాలిపోయిందని సగం గింజలు బురదలో నానిపోయాయని ఎకరాకు 35 బస్తాలు దిగుబడి వస్తుందని ఆశించిన రైతులు ఆశలు అడియాసయ్యాయని, చేతికి 20 బస్తాలు రావటమే కష్టమైందని రైతులు ఆక్రోశాన్ని వెళ్లబుచ్చారు. ఈ సందర్భంగా కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ రైతుల్ని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని, వ్యవసాయ రుణాలన్నీ రద్దు చేయాలని, అదేవిధంగా దేవాదాయ ధర్మాదాయ కౌలును మాఫీ చేయాలని, ఆర్బీకే కేంద్రాల ద్వారా రైతులకు వారికి కావాల్సిన విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని, ధాన్యాన్ని ఎటువంటి షరతులు లేకుండా ప్రభుత్వమే మద్దతు ఇచ్చి కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలుఉలపూడి రాము, అంజిరెడ్డి, యు కిరణ్ శ్రీనివాస్ రెడ్డి, అచ్యుత్ రెడ్డి, గోపు రెడ్డి పున్నారెడ్డి, రాజు శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, కిష్టయ్య, పున్నారావు తదితర రైతులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయం, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref/B1/29/2023 **ఫారం-సి** Dt : 18-01-2023

ప్రకటన ద్వారా పబ్లిక్ నోటీసు

(10ఎ మినహాయింపు ఇచ్చినప్పుడు చట్టంలోని 11వ విభాగం (క్రింద) (6/12) నియమం చూడండి)

అల్లూరి సీతారామరాజు జిల్లా

క్రింది చూపిన విధముగా ప్రజా ప్రయోజనం అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద ముంపునకు గురగుచు భూమిని కోల్పోయి నిర్వాసితులు అవుతున్న దేవీపట్నం మండలం, కొండమొదలు గ్రామంలోని గిరిజన రైతులకు "పరస్పర అవగాహన ఒప్పందం ప్రకారం" భూమిని కేటాయించు నిమిత్తము భూమి స్థలసేకరణ నిమిత్తం గంగవరం (ఏజెన్సీ) మండలం, రాజవరం గ్రామము నందు ఎ.1.58 సెంట్లు భూమి అవసరమని స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు భావిస్తున్నారు.

షెడ్యూలు

మండలము : గంగవరం (ఏజెన్సీ) గ్రామం : రాజవరం

క్రమ సంఖ్య	సర్వే నెం. సబ్ డివిజన్ నెం.	పూర్తి విస్తీర్ణం ఎకరాలు	భూసేకరణకు సేకరించిన విస్తీర్ణం ఎకరాలు	భూ స్వభావం	యజమాని / పట్టాదారుని పేరు లేదా అనుభవదారుని పేరు	దిక్కులు వివరములు: ఉత్తరం	తూర్పు	దక్షిణం	పడమర	భూమిపై ఉన్న భవనాలు లేదా మొక్కలు లేదా ఇతరములు
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)
1	28-5	3.16	1.58	జిరాయితీ పుంజ	కురసం వెంకన్న దొర	28/4	28/ 2, 6	33	28/2	జంగారు-3 మామిడి-1, తాడి-6 వేప మొక్కలు-2
	మొత్తం		1.58							

పని గంటల సమయంలో 15ఏదేని పని రోజున పని గంటలలో (సమయంలో) స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి కార్యాలయంలో భూమి యొక్క ప్లాన్ ను పరిశీలించవచ్చు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎల్.ఎం.సి. యూనిట్-1, రాజమహేంద్రవరంవారు మరియు వారి సిబ్బంది భూమిలోకి ప్రవేశించి సర్వే చేయడానికి, ఏదైనా భూమి మట్టాలను తీసుకోవడానికి, భూమి క్రింద పొరను త్రవ్వడానికి లేదా తొలచడానికి మరియు వారి పనిని సరిగ్గా అమలు చేయడానికి అవసరమైన అన్నీ ఇతర చర్యలను చేయడానికి స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు అధికారాన్ని ఇవ్వడమైనది.

స్పెషల్ కలెక్టర్(భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి యొక్క ముందస్తు అనుమతి లేకుండా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి ఏ వ్యక్తి లావా దేవీలు చేయకూడదు లేదా అటువంటి భూమి పై ఏ విధమైన ఋణ భారములను సృష్టించరాదు.

సేకరణకు ఏవైనా అభ్యంతరాలు వుంటే, మరియు నష్ట పరిహారం సంప్రదింపుల ద్వారా పరిష్కారం కోసం ఆసక్తి ఉన్న/ప్రభావిత వ్యక్తులందరి క్లెయిములను ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 15(పదిహేను రోజులు లోపు భూమిపై ప్రయోజనం వున్న వ్యక్తి దాఖలు చేయవచ్చును.

సి.వి. ప్రవీణ్ ఆదిత్య, ఐ.ఎ.ఎస్., స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) (ఎఫ్ఎసి), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయం, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref/B1/28/2023 **ఫారం-సి** Dt : 18-01-2023

ప్రకటన ద్వారా పబ్లిక్ నోటీసు

(10ఎ మినహాయింపు ఇచ్చినప్పుడు చట్టంలోని 11వ విభాగం (క్రింద) (6/12) నియమం చూడండి)

అల్లూరి సీతారామరాజు జిల్లా

క్రింది చూపిన విధముగా ప్రజా ప్రయోజనం అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద ముంపునకు గురగుచు భూమిని కోల్పోయి నిర్వాసితులు అవుతున్న దేవీపట్నం మండలం, కొండమొదలు గ్రామం లోని గిరిజన రైతులకు "పరస్పర అవగాహన ఒప్పందం ప్రకారం" భూమిని కేటాయించు నిమిత్తము భూమి స్థలసేకరణ నిమిత్తం గంగవరం (ఏజెన్సీ) మండలం, పోతన్నదొరపాలెం గ్రామము నందు ఎ.24.84 సెంట్లు భూమి అవసరమని స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు భావిస్తున్నారు.

షెడ్యూలు

మండలము : గంగవరం (ఏజెన్సీ) గ్రామం : పోతన్నదొరపాలెం

క్ర. సంఖ్య	సర్వే నెం. సబ్ డివిజన్ నెం.	పూర్తి విస్తీర్ణం ఎకరాలు	భూసేకరణకు సేకరించిన విస్తీర్ణం ఎకరాలు	భూ స్వభావం	యజమాని / పట్టాదారుని పేరు లేదా అనుభవదారుని పేరు	దిక్కులు వివరములు: ఉత్తరం	తూర్పు	దక్షిణం	పడమర	భూమిపై ఉన్న భవనాలు లేదా మొక్కలు లేదా ఇతరములు
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)
1	12	5.03	3.50	జిరాయితీ పుంజ	పసమర్తి వీర వెంకట సత్య రామకృష్ణ	13	14	ఓజ బంద గ్రామం	11	తాడి-18
2	35-2	3.21	2.46	జిరాయితీ పుంజ	కారం సింధు	35/1	34	28	22	--
3	35-2	3.21	0.73 పుంజ	జిరాయితీ	కారం అరుణశ్రీ	35/1	34	28	22	--
4	48-1	5.32	1.32	జిరాయితీ పుంజ	కొమరం బుల్లియమ్మ	46	48/2	50	49	--
5	48-2	0.68	0.68	జిరాయితీ పుంజ	కొమరం బుల్లియమ్మ	48/1	46	47	48/1	--
6	63-3	1.38	1.38	జిరాయితీ పుంజ	కారం దుర్గాప్రసాద్ దొర	63/1	63/5	63/4 5	63/2	తాడి-18 జీడి మామిడి-4 (4సం.లు)
7	63-5	0.72	0.68	జిరాయితీ పుంజ	కారం దుర్గాప్రసాద్ దొర	63/1	62	55	63/3 4	తాడి-19 జీడిమామిడి-32 (4సం.లు)
8	64-3	0.34	0.34	జిరాయితీ పుంజ	కారం అరుణశ్రీ	64/4	64/4	45	64/6	--
9	64-4	5.02	5.02	జిరాయితీ పుంజ	కారం అరుణశ్రీ	66	63	64/5	64/1, 6,3	--
10	68-1	4.66	4.66	జిరాయితీ పుంజ	కారం అరుణశ్రీ	69	67	68/2	42 43	--
11	69-3	0.91	0.91	జిరాయితీ పుంజ	కారం లక్ష్మీనారాయణ దొర	73	69/4	69/2	69/1	వేప-3
12	71-2	3.16	3.16	జిరాయితీ పుంజ	కంగల అబ్బాయిదొర	73	73	61	71/1	దుంపతోట తాడి-61
	మొత్తం		24.84							

పని గంటల సమయంలో 15ఏదేని పని రోజున పని గంటలలో (సమయంలో) స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి కార్యాలయంలో భూమి యొక్క ప్లాన్ ను పరిశీలించవచ్చు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎల్.ఎం.సి. యూనిట్-1, రాజమహేంద్రవరంవారు మరియు వారి సిబ్బంది భూమిలోకి ప్రవేశించి సర్వే చేయడానికి, ఏదైనా భూమి మట్టాలను తీసుకోవడానికి, భూమి క్రింద పొరను త్రవ్వడానికి లేదా తొలచడానికి మరియు వారి పనిని సరిగ్గా అమలు చేయడానికి అవసరమైన అన్నీ ఇతర చర్యలను చేయడానికి స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు అధికారాన్ని ఇవ్వడమైనది.

స్పెషల్ కలెక్టర్(భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి యొక్క ముందస్తు అనుమతి లేకుండా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి ఏ వ్యక్తి లావా దేవీలు చేయకూడదు లేదా అటువంటి భూమి పై ఏ విధమైన ఋణ భారములను సృష్టించరాదు.

సేకరణకు ఏవైనా అభ్యంతరాలు వుంటే, మరియు నష్ట పరిహారం సంప్రదింపుల ద్వారా పరిష్కారం కోసం ఆసక్తి ఉన్న/ప్రభావిత వ్యక్తులందరి క్లెయిములను ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 15(పదిహేను రోజులు లోపు భూమిపై ప్రయోజనం వున్న వ్యక్తి దాఖలు చేయవచ్చును.

సి.వి. ప్రవీణ్ ఆదిత్య, ఐ.ఎ.ఎస్., స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) (ఎఫ్ఎసి), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయం, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref/B1/27/2023 **ఫారం-సి** Dt : 18-01-2023

ప్రకటన ద్వారా పబ్లిక్ నోటీసు

(10ఎ మినహాయింపు ఇచ్చినప్పుడు చట్టంలోని 11వ విభాగం (క్రింద) (6/12) నియమం చూడండి)

అల్లూరి సీతారామరాజు జిల్లా

క్రింది చూపిన విధముగా ప్రజా ప్రయోజనం అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద ముంపునకు గురగుచు భూమిని కోల్పోయి నిర్వాసితులు అవుతున్న దేవీపట్నం మండలం, కొండమొదలు గ్రామంలోని గిరిజన రైతులకు "పరస్పర అవగాహన ఒప్పందం ప్రకారం" భూమిని కేటాయించు నిమిత్తము భూమి స్థలసేకరణ నిమిత్తం గంగవరం (ఏజెన్సీ) మండలం, జియ్యంపాలెం గ్రామము నందు ఎ.23.01 సెంట్లు భూమి అవసరమని స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు భావిస్తున్నారు.

షెడ్యూలు

మండలము : గంగవరం (ఏజెన్సీ) గ్రామం : జియ్యంపాలెం

క్రమ సంఖ్య	సర్వే నెం. సబ్ డివిజన్ నెం.	పూర్తి విస్తీర్ణం ఎకరాలు	భూసేకరణకు సేకరించిన విస్తీర్ణం ఎకరాలు	భూ స్వభావం	యజమాని / పట్టాదారుని పేరు లేదా అనుభవదారుని పేరు	దిక్కులు వివరములు: ఉత్తరం	తూర్పు	దక్షిణం	పడమర	భూమిపై ఉన్న భవనాలు లేదా మొక్కలు లేదా ఇతరములు
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)
1	8	12.36	12.36	జిరాయితీ పుంజ	కారం అనసూయమ్మ	2	7, 10	జియ్యం పాలెం గ్రామం	జియ్యం పాలెం గ్రామం	జీడిమామిడి మొక్కలు-210
2	14-3	5.78	5.78	జిరాయితీ పుంజ	కారం బాబూరావు దొర	9	13, 15	18	14/1	మొక్కజొన్న తాడి-10
3	15-1	0.19	0.19	జిరాయితీ పుంజ	కారం బాబూరావు దొర	13	15/4	15/2	14	మొక్కజొన్న
4	15-4	4.68	4.68	జిరాయితీ పుంజ	కారం బాబూరావు దొర	15/3	16	18	15/2	మొక్కజొన్న తాడి-8 కుంకుడు-2
	మొత్తం		23.01							

పని గంటల సమయంలో 15ఏదేని పని రోజున పని గంటలలో (సమయంలో) స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి కార్యాలయంలో భూమి యొక్క ప్లాన్‌ను పరిశీలించవచ్చు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎల్.ఎం.సి. యూనిట్-1, రాజమహేంద్రవరంవారు మరియు వారి సిబ్బంది భూమిలోకి ప్రవేశించి సర్వే చేయడానికి, ఏదైనా భూమి మట్టాలను తీసుకోవడానికి, భూమి క్రింద పొరను త్రవ్వడానికి లేదా తొలచడానికి మరియు వారి పనిని సరిగ్గా అమలు చేయడానికి అవసరమైన అన్నీ ఇతర చర్యలను చేయడానికి స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు అధికారాన్ని ఇవ్వడమైనది.

స్పెషల్ కలెక్టర్(భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి యొక్క ముందస్తు అనుమతి లేకుండా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి ఏ వ్యక్తి లావా దేవీలు చేయకూడదు లేదా అటువంటి భూమి పై ఏ విధమైన ఋణ భారములను సృష్టించరాదు.

సేకరణకు ఏవైనా అభ్యంతరాలు వుంటే, మరియు నష్ట పరిహారం సంప్రదింపుల ద్వారా పరిష్కారం కోసం ఆసక్తి ఉన్న/ప్రభావిత వ్యక్తులందరి క్లెయిములను ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 15(పదిహేను రోజులు లోపు భూమిపై ప్రయోజనం వున్న వ్యక్తి దాఖలు చేయవచ్చును.

సి.వి. ప్రవీణ్ ఆదిత్య, ఐ.ఎ.ఎస్., స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) (ఎఫ్ఎసి), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

సంపాదకీయం

మోదీకి మింగుడు పడని నిష్ఠుర సత్యం

మొహం బాగాలేక అద్దం పగులగొట్టినట్టు మోదీ సర్కారు 2002లో గుజరాత్ మారణకాండపై బిబిసి రూపొందించిన డాక్యుమెంటరీ చిత్రాన్ని వీక్షించడానికి వీలులేకుండా నిషేధించింది. నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గోద్రా రైలుపెట్టె దహనం పర్యవసానంగా మూడురోజులపాటు తీవ్ర స్థాయిలో ముస్లింలపై మారణకాండ కొనసాగింది. సాధారణంగా ఈ మారణకాండను గుజరాత్ మతకలహాలు అనడం పరిపాటి అయింది. నిజానికి ఇవి మతకలహాలు కావు. రెండు మతవర్గాలు కలహాలకు పాల్పడితే అవి మత కలహాల కింద లెక్క. కానీ 1984లో ఢిల్లీలో సిక్కులమీద భీకరమైన దాడి, 2002లో గుజరాత్‌లో ముస్లింలపై కిరాతకమైన దాడి ఒక మతం వారిపై కసి తీర్చుకోవడానికి, లేదా ఆ మతం వారిని నిర్మూలించడానికి చేసిన ప్రయత్నాలే. లక్ష్యం సాధించారా లేదా అన్న అంశం పక్కనపెడ్తే ఈ మారణకాండ వెనక ఉన్న ఉద్దేశాన్ని తక్కువ అంచనా వేయలేం. సాక్షాత్తు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రెండుదశాబ్దాల కింద తాము గుణపాఠం చెప్పిన తరవాతే మతకలహాలు ఆగాయని ఢంకామీద దెబ్బవేసి మరీ చెప్పారు. ఇది గుజరాత్ మారణకాండలో అప్పటి ముఖ్యమంత్రి మోదీ పాత్రను అంగీకరించడమేగా! గుజరాత్ మారణకాండ జరిగిన తరవాత, మేధావులు, రచయితలు, పత్రికా రచయితలు అక్కడ పర్యటించి బోలెడు నివేదికలు విడుదల చేశారు. ఈ నివేదికలన్నీ మోదీ వేపే వేలెత్తి చూపించాయి. గుజరాత్ మండిపోతుంటే మోదీప్రభుత్వం చూస్తూ కూర్చోవడమే కాదు జనాగ్రహం వెళ్లగక్కడానికి అవకాశం ఇవ్వాలని పోలీసులని ఆదేశించాలని నోటిమాటగా ఉత్తర్వులు జారీచేసినట్టు కూడా వార్తలొచ్చాయి. సాక్షాత్తు అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి గోవాలో జరిగిన బీజేపీ జాతీయ కార్యవర్గసమావేశంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీని తొలగించాలని అనుకున్నారు. అధికారంలో ఉన్నవారు రాజధర్మం పాటించాలని కూడా అన్నారు. కానీ బీజేపీ సీనియర్ నాయకుడు లాల్‌కృష్ణఅడ్వానీ అడ్డు పడ్డందువల్ల మోదీ పదవిలో కొనసాగారు. ఆ తరవాత మోదీ గుజరాత్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నానని ఇది గుజరాత్ నమూనా అని భారీఎత్తున ప్రచారం చేసుకున్నారు. గుజరాత్ నమూనా అన్న పదబంధానికి మోదీ, ఆయన భక్తులు ఏ నిర్వచనం చెప్పినా గుజరాత్ నమూనా అంటే మారణకాండే గుర్తుకు వస్తుంది. మోదీ మీద దాఖలైన అనేక కేసులు న్యాయస్థానాల్లో తేలిపోయాయి. అధికారంలో ఉన్నవారికి వ్యతిరేకంగా సాక్ష్యాధారాలు సేకరించడం సులభం కానందువల్లే మోదీ నిర్దోషిగా బయటపడ్డారు. ఆ సమయంలో ప్రపంచమంతా గుజరాత్ మారణ కాండను తీవ్రంగా దుయ్యబట్టింది. అమెరికా అయితే మోదీకి వీసా ఇవ్వడానికి నిరాకరించింది. బిబిసి రూపొందించిన డాక్యుమెంటరీ చిత్రాన్ని మోదీ ప్రభుత్వం నిషేధించినా ఇప్పటికే ఆ డాక్యుమెంటరీని చూడడమే కాదు ట్విట్టర్‌లో ఇతరులకు పంపిన ప్రముఖులూ ఉన్నారు. తృణమూల్ కాంగ్రెస్ నాయకులు మహువా మొయిత్రి, డెరిక్ ఓబ్రియాన్ ఇలా ట్విట్టర్ ద్వారా పంపారు. ఈ లింకులను ప్రభుత్వం తొలగింప చేసింది. ఇది సూర్యకాంతికి అరచేయి అడ్డం పెట్టడంలాంటిదే. ఉత్తరప్రదేశ్‌లో ఇలాగే మతకలహాలు రెచ్చగొట్టిన నేపథ్యంలో ముజఫర్ నగర్ బాఖీహై సినిమావస్తే దాని మీదా బీజేపీ నానా రచ్చచేసింది. ఆ సినిమాను ఎక్కడ ప్రదర్శిస్తే అక్కడ గొడవచేసింది. ఆ సినిమాను మెచ్చుకున్న వారందరినీ దేశద్రోహుల జాబితాలో చేర్చింది.

గుజరాత్ మారణకాండపై బిబిసి డాక్యుమెంటరీ మొదటిభాగం మాత్రమే వచ్చింది. ఇంకా రెండో భాగం రావలసి ఉంది. ఈ సినిమాలో అప్పటి ఇంగ్లాండ్ విదేశాంగశాఖమంత్రి జాక్ స్ట్రా ఇంటర్వ్యూ కూడా ఉంది. అప్పుడు ఇంగ్లాండ్ ప్రభుత్వంకూడా దర్యాప్తు లాంటిది నిర్వహించింది. బిబిసి డాక్యుమెంటరీ ఒక ప్రచారాస్త్రం అని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి అరిందం బాగ్చీ అంటున్నారు. ఇంతకీ ఆయన ఈ డాక్యుమెంటరీ చూడనేలేదు. చూడకపోయినా ఏలినవారి మానరక్షణ బాధ్యత నెరవేర్చడానికి ఆయన పడరాని పాట్లు పడ్డారు. అసలు పరాయిదేశం మనదేశంలో దర్యాప్తు చేయడం ఏమిటి అనికూడా ఆయన ప్రశ్నిస్తున్నారు. మానవ హననం ఎక్కడ జరిగినా మానవాళి ఆందోళన వ్యక్తంచేస్తూనే ఉంది. అలాంటి దురాగతాల్ని ఖండిస్తూనే ఉంది. రికార్డు చేస్తూనే ఉంది. బాధితుల తరఫున నిలబడడాన్ని ఎవరిని ఎవరూ ఆపలేరు. కానీ మోదీ ప్రభుత్వంలాగే వితండవాదానికి దిగేవారు ఇంగ్లాండ్‌లోనూ ఉన్నారు. ఇంగ్లాండ్ పార్లమెంటు ఎగువసభ సభ్యుడు లార్డ్ రమీరంగెర్ భారత్ జి20 బృందానికి అధ్యక్ష స్థానంలో ఉన్నప్పుడు ఈ డాక్యుమెంటరీ విడుదల చేయడం ఏమిటి అని ఆశ్చర్య పోతున్నారు. బ్రిటన్ ప్రధానమంత్రి రుషి సునక్ భారతీయ మూలాలున్న వారు కనక ఇప్పుడు ఈ గొడవేమిటి అనే వాళ్లూ ఉన్నారు. ఈ డాక్యుమెంటరీలో మోదీని చిత్రించిన తీరును తాను ఆమోదించలేనని సునక్ సెలవిచ్చారు. ఎవరిఅభిప్రాయం ఎలాఉన్నా ఈ డాక్యు మెంటరీని చూసిన వారిలో చాలామంది ఇది జాగ్రత్తగా, లోతైన పరిశోధనచేసి రూపొందించినచిత్రం అంటున్నారు. సుప్రీంకోర్టు మోదీని నిర్దోషిగా వదిలేస్తే ఇప్పుడు ఆయనను బిబిసి దోషిగా నిలబెడ్తుందా అని నిలదీస్తున్న వారికీ కొదవలేదు. ఉత్తమ పరిశోధనాత్మక పత్రికా రచనకు ప్రతీకగా నిలిచిన తెహల్కా పత్రిక గుజరాత్ మారణకాండ జరిగిన దాదాపు పదేళ్లకు రాణా అయూబ్ అనే పత్రికా రచయితను గుజరాత్ పంపి వాస్తవాన్ని వెలికి తీయమని చెప్పింది. అనేక నెలలు కష్టపడి రాణా అయూబ్ చాలా విలువైన సాక్ష్యాధారాలు సేకరించారు. చివరకు తెహల్కా పత్రిక ఆమె సేకరించిన వార్తలను ప్రచురించే సాహసం చేయలేకపోయింది. మోదీ ప్రభావం అంటే అదే. ఏ వాదనా దొరకని వారు ఈ డాక్యుమెంటరీ భారత సార్వభౌమత్వం మీద దాడి అని పెద్దబండరాళ్ల లాంటి మాటలను నిష్ప్రయోజనకరంగా దొర్లిస్తున్నారు. బిబిసి ప్రధానంగా మీడియా వ్యవస్థ. ఆ వ్యవస్థ వెలువరించే వార్తలకు చాలా గౌరవం ఉంటుంది. కచ్చితమైన సమాచారం తెలుసుకోవడానికి, లేదా తెలిసిన సమాచారాన్ని ధ్రువీకరించుకోవడానికి బిబిసి మీద ఆధారపడే వారు చాలా మంది ఉన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం అని బోర విరుచుకు తిరిగే మోదీ ప్రభుత్వం మాత్రం నిష్ఠుర సత్యాన్ని అంగీకరించడానికి నిరాకరిస్తోంది.



ఆగిపోయిన రావిపూడి కలం

రావిపూడిని అర్థం చేసుకుంటే ఆయన రానున్న తరాలకు కూడ ఎంతో అవసరం అనిపిస్తుంది. సైన్సుకు రావిపూడి రచనలకు కామాలు తప్ప పులుస్టాపులు వుండవు. ఈ విశ్వాన్వేషణలో తెలియని దానికోసం తెలుసుకోవడానికి సైన్సు, దానివెంట రావిపూడి పరుగు పెడుతూనే వున్నారు. ఆ పరుగు ఆపితే మనిషి అంధకారంలో కూరుకుపోయి పరాధీనుడవుతాడు. ఆయన అన్ని విషయాలలో నిష్ణాతుడు. కాని ఆయన అలా అనుకోడు. తాను నిత్యవిద్యార్థినని అనుకొనే ఎన్నో విషయాలు తెలుసుకుని సమాజానికందించారు. కాని ఇప్పుడు ఆయన కలం ఆగిపోయింది. ఆయన వందకు పైగా గ్రంథాలను మనకు అందించినా యింకా చెప్పవలసినవి రాయవలసినవి ఎన్నో వుండగా ఆయన్ని మృత్యువు కబళించడం విజ్ఞానం కోరే ప్రతివ్యక్తి తట్టుకోలేని విషయం. ఆయన ఇంకా ఎక్కువకాలం జీవించి ఉంటే ఎన్నో గ్రంథాలు అందించేవారు. రావిపూడి లేకపోతే సమాజంలో ఎక్కువ శాతం ఆలోచించడం మాని ఇతరులను అనుసరించి పరాధీనులయ్యేవారు. ఆయన రచనల వలనే శాస్త్రీయంగా స్వతంత్రంగా ఆలోచించడం మొదలుపెట్టారు. ఒక వ్యక్తి తాను మనిషినని జంతువులాగా కాక ఆలోచించే శక్తి వుందని ఆ ఆలోచనల నుండి పుట్టే భావాల నుండి అభ్యుదయ బాట ఏర్పాటు చేసుకుని సమాజాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగుతున్నానని చెప్పడానికి రావిపూడి వెన్నుతట్టి నడిపిస్తున్నారని చెప్పడంలో అతిశయోక్తిలేదు.

నేను రావిపూడిని మొదటిసారి 1968లో కలిశాను. విజయవాడ వస్తున్నారని తెలిసి గుడివాడ నుండి వెళ్ళాను. అక్కడ జరిగిన సమావేశంలో రావిపూడి పరిచయమయ్యారు. ఆ తరువాత రెండు మూడు సమావేశాలలో ఆయన ఉపన్యాసాలు విని ఆయన రచనలు చదవాలనిపించింది. ఆ సమయంలో ఎంఎన్‌రాయ్ భారత కమ్యూనిజం అనే గ్రంథం రావిపూడి రాసి అచ్చువేసేందుకు ఆర్థిక సహాయం కోసం చూస్తున్నారని తెలిసి ఒక డాన్సు కార్యక్రమం ఏర్పాటు చేసి వచ్చిన సొమ్ముతో ఆ గ్రంథం అచ్చు వేయించే భాగ్యం నాకు కలిగింది. ఆ తర్వాత రాష్ట్ర హేతువాద సభకు భీమవరం, రాజమండ్రి వెళ్ళాను. 1982లో హేతువాద పత్రిక మొదలయిన నాటి నుండి చదువుతూ రావిపూడి రచనల వల్ల మనిషి ఆలోచించాలని ప్రశ్నించి నిజం తెలుసుకోవాలని గుడ్డిగా ఎవరిని అనుసరించకూడదని తెలుసుకున్నాను. ఆ ఒరవడిలో సాగుతూ త్రిపురనేని రామస్వామి రచనల వల్ల మనిషి ఆలోచించాలని, గుడ్డిగా అనుసరించకూడదని త్రిపురనేని రచనలు కొంత తడిమి చూశాను. ఆయన రాసిన ఖూని నాటకం 1970 జనవరిలో బెజవాడ గోపాలరెడ్డిని, కొండవీటి, వెంకట కవి వీర్రాజు మాధవాచారిల సమక్షంలో కవిరాజ హాలులో గుడివాడలో ప్రదర్శించాను.

ఆ విషయం తెలుసుకున్న రావిపూడి 1971 ఏప్రిల్‌లో చీరాల ఓపెన్‌ఎయిర్ థియేటరులో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కొంతమంది ఆధ్యాత్మికవాదులు ఆ ప్రదర్శన చూచి గౌతమ మహర్షికి మద్దతుగ కొన్ని పద్యాలు రాసి ఇచ్చి అవికూడ చేర్చి మరునాడు మరో ప్రదర్శన ఏర్పాటు చేశారు. వారి కోరిక మేరకు రెండవ రోజు మరోసారి ప్రదర్శించాం. ముఖ్యంగా రావిపూడి రచనలలో జీవమంటే ఏమిటి, విశ్వాన్వేషణ చదివి తీరవలసిన గ్రంథాలు, ఆయన రచనలన్నీ మనిషి పరిపూర్ణ మానవుడిగా మారడానికి, మనిషిగా బతకడానికి దోహదపడతాయి. ఆయనకు అనేక బిరుదులు అవార్డులు, ఎన్నో సన్మానాలు జరిగాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఆయన సాహితీ సేవలు గుర్తించి పద్మశ్రీ ఇచ్చేందుకు ప్రయత్నిస్తే ప్రగతిశీలురు సంతోషిస్తారు. ఆయన 102వ సంవత్సరంలో జనవరి 21న మరణించడం ముఖ్యంగా ప్రగతిశీలురు తట్టుకోలేని విషయం.

బందారు రాధాకృష్ణ
సీనియర్ జర్నలిస్టు, 9885569397

రాజ్యాంగ పరిరక్షణ అవశ్యం

భారత స్వాతంత్ర్య లక్ష్యాలు, అభివృద్ధి ఫలాలు ప్రజాస్వామ్య అమృత ఫలాలు కొందరికే సొంతం చేసేలా నేటి పాలకులు ముఖ్యంగా ఆర్ఎస్ఎస్, బిజెపి ప్రభుత్వం గత ఎనిమిది సంవత్సరాలుగా పనిచేస్తుంది. రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తుంది. రాజ్యాంగం పరంగా పనిచేయాల్సిన స్వతంత్ర సంస్థలను వరుస క్రమంలో నిర్వీర్యం చేస్తున్నది. ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేయడం, మైనార్టీ మతాల పట్ల అసహనం, విభజన రాజకీయాలను నెరపడం హిందూ రాజ్య స్థాపన దిశగా అడుగులు వేయడం వలన దేశ సమగ్రత, సెక్యులర్ ,సోషలిస్ట్ భావనలు వెనక పడుతున్నాయి. ఈ నేపథ్యంలో జనవరి 26వ తేదీన దేశ వ్యాప్తంగా నిర్వహించుకుంటున్న 73వ రాజ్యాంగ దినోత్సవం రోజున "రాజ్యాంగాన్ని పరిరక్షించండి" అంటూ సిపిఐ దేశవ్యాప్తంగా జాతీయ జెండాను ఎగురవేసే కార్యక్రమం నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపిచ్చింది. ఈ సందర్భంగా రాజ్యాంగ పీఠికలో ప్రస్తావించిన అంశాలను నేడు తిరగతోడుతున్న విషయం ముఖ్యంగా పరిశీలించాలి. పీఠికలో పొందుపరిచిన సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా కొనసాగించాల్సి ఉంది. సార్వభౌమత్వం అనగా ఇతర ప్రభుత్వాల జోక్యం లేకుండా, అంతర్గత, బహిర్గత విషయాలలో స్వేచ్ఛగా నిర్ణయం తీసుకునే సామర్థ్యం కలిగి ఉండడం. అయితే చాలా విషయాల్లో అమెరికా, ప్రపంచ బ్యాంకు ఒత్తిళ్లకు లొంగిపోతుందనే అభిప్రాయం బలంగా ఉంది. ప్రపంచీకరణలో భాగంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్డీఐ) రక్షణ, అణురంగాల్లో 100% తీసుకురావడం ద్వారా దేశ సార్వభౌమత్వానికి ప్రమాదం ఏర్పడుతుందనేది తేటతెల్లమవుతుంది.

తొలి ప్రధాని నెహ్రూ దేశంలో మిశ్రమ ఆర్థిక వ్యవస్థ వేళ్ళూనుకొనేలా తీర్చి దిద్దారు. ప్రభుత్వ రంగంలో కీలకమైన బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, కమ్యూనికేషన్ నవరత్నాల లాంటి భారీ పరిశ్రమలు నెలకొల్పారు. అందుకు భిన్నంగా నేడు ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు దఖలు చేస్తోంది. అది కూడా గుజరాత్‌కు చెందిన అదాని ,అంబానీల వశం చేస్తున్నారు. ఫలితంగా 40 శాతం జాతీయ సంపద ఒక శాతం బడాబాబుల చేతికి చేరింది. ధనిక, పేదల మధ్య అంతరం పెరిగిపోయింది. లౌకిక భావన మేరకు మత ప్రమేయం లేని రాజ్యంగా కొనసాగాలి. ప్రభుత్వానికి అధికార మతం అనేది ఉండరాదు. అన్ని మతాలకు సమ ప్రాధాన్యత కల్పించాలి. నేటి ప్రభుత్వం విడి సావర్కర్, గురు గోల్వాల్కర్ వంటి కరుడుగట్టిన ఆర్ఎస్ఎస్ నేతల అడుగుజాడల్లో నడుస్తుంది. అయోధ్య ఆలయ స్థలం రామాలయానికి దఖలు చేసే సందర్భంగా న్యాయ వ్యవస్థను లొంగదీసుకున్న తీరు, తదుపరి శంకుస్థాపన సందర్భంగా మోదీ ప్రసంగం రాజ్యాంగ స్ఫూర్తిగా భిన్నంగా ఉంది. ప్రధాని హోదాలో ఉన్న వ్యక్తి శతాబ్దాల బానిసత్వం నుండి విముక్తి చేసేటువంటి సుదినం అంటూ పేర్కొనడం ఇతర మతాలపై ద్వేషం పెంచేలా ఉంది. కాశీలోని మసీదులో జ్ఞాన దీపలింగం వివాదం, సీఏఏ, ఎన్నార్సీ వంటి వివాదాస్పద అంశాలు తెరపైకి తీసుకువచ్చారు. పౌరసత్వం వివాదం రేపి మైనార్టీలలో అభద్రతా భావం కొనసాగిస్తోంది. జమ్ము కాశ్మీర్ రాష్ట్ర సమస్యను రావణకాష్టంగా మారుస్తోంది. 370 ఆర్టికల్ రద్దు చేయడం ద్వారా రాష్ట్ర హోదాని తగ్గించడంతో అక్కడ అన్ని పార్టీలు కేంద్రానికి వ్యతిరేకంగా ఉద్యమించేలా చేస్తున్నది. మైనార్టీల ఆహారము, ఆహార్యంలపై ఆంక్షలు విధిస్తూ వారి హక్కులను కాల రాస్తున్నది. కుంభమేళా, గంగా హారతి, బెంగాల్ ఎన్నికల్లో సాగించిన ప్రచార హోరు, ట్రంప్ పర్యటన సందర్భంగా వేలాది మందితో నిర్వహించిన జాతరలు, సభల పర్యవసానంగా కోవిడ్ 19 దేశంలో ప్రవేశిస్తే, ఢిల్లీలో నిర్వహించిన "తబ్లిక్" వలనే కోవిడ్ విజృంభించిందని విష ప్రచారం గావించి వారి హృదయాలను గాయపరిచింది.

ప్రజాస్వామ్య భావన జాతీయోద్యమ కాలం నుండి ప్రజల ఆకాంక్షలతో ముడిపడిన అంశం. ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజల ప్రభుత్వమన్న భావనను అపహాస్యం చేస్తుంది. ప్రజాస్వామ్యం అంటేనే రాజకీయ సామాజిక, ఆర్థిక, ప్రజాస్వామ్యంగా భావించాలి. అయితే పాలనలో అనేక అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతోంది. ప్రజాస్వామ్య పద్ధతులలో ఎన్నికైన ప్రభుత్వాలను అనైతిక పద్ధతిలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ వాటిని దింపి వేయడం పరిపాటిగా మారుతుంది..గోవా ,కర్ణాటక ,మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో అధికారాన్ని చేజిక్కించుకున్న క్రమం అలాగే కేరళ, తమిళనాడు, ఢిల్లీ, తెలంగాణ గవర్నర్లు ప్రభుత్వ కార్యక్రమాల్లో జోక్యం చేసుకోవడం, ఆర్డినెన్స్‌లతో కార్మిక చట్టాలు, వ్యవసాయ చట్టాలు తీసుకురావడం, జీఎస్టీతో రాష్ట్రాల హక్కులను కాల రాయడం, పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలు నేటికీ చాలా రాష్ట్రాల్లో ఏపీతో సహా అమలు చేయకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. గణతంత్ర రాజ్యంగా 1950 లో అమలులోకి వచ్చాక అధికారం ప్రజలెన్నుకున్న ప్రభుత్వం చేతుల్లో ఉంటుంది. కుల ,మత, లింగ వివక్షత లేకుండా రాజ్యంలో అన్ని పదవులను నిర్వహించుటకు వీరికి అవకాశం ఉంది. అయితే నేటి పాలకులు దేశం హిందు రాష్ట్రంగా మార్చాలన్న, లక్ష్యంతో పనిచేస్తున్నది.

రాజ్యాంగ పీఠికలో పొందుపరిచిన అంశాలను నీరు కార్చి, తూట్లు పొడుస్తున్న అతి ప్రాముఖ్యమైన ప్రాథమిక హక్కులు కాల రాయడం, ఆదేశిక సూత్రాలను ఉల్లంఘించడం. చివరగా "మనువు" రాజ్యాంగాన్ని తీసుకొచ్చే ప్రయత్నంలో భాగంగా రాజ్యాంగంపై దాడులకు పూనుకొంటున్నది. ప్రాథమిక హక్కులకు భంగం కల్పిస్తే కోర్టుల జోక్యంతో వాటిని సంరక్షించుకునే వెసులుబాటు రాజ్యాంగం కల్పించినందున కొంతవరకు ఉపశమనం కలుగుతుంది. అయితే ఆదేశిక సూత్రాలు విషయంలో కోర్టుల జోక్యం తగదని రాజ్యాంగం 37నిబంధనలో పొందుపరిచినప్పటికీ ప్రజా సంక్షేమాన్ని మంట కలుపుతున్నది. భారత రాజ్యాంగంలోని 12 నుండి 35 నిబంధన వరకు ప్రాథమిక హక్కుల గురించి తెలియజేస్తుంది. మానవుడు సంపూర్ణంగా, సమగ్రంగా అభివృద్ధి చెందేందుకు కావాల్సింది ప్రాథమిక హక్కులు .ప్రభుత్వాల నియంతృత్వాన్ని అరికట్టి వ్యక్తుల హక్కులకు రక్షణ కల్పించేది న్యాయస్థానాలు. అందులో ముఖ్యంగా 14 -18 వరకు సమానత్వపు హక్కు, 19- 22 వరకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యపు హక్కు, 25 -28 వరకు మత స్వేచ్ఛ హక్కు ,29- 30 వరకు విద్య, సాంస్కృతిక హక్కు వంటివి పొందుపరిచారు. 14(ఏ) నిబంధన మేరకు చట్టం ముందు అందరూ సమానులే . 19(ఏ) నిబంధనలో భావ ప్రకటనా స్వేచ్ఛ ఇందులో అతి ప్రధానమైనది. దీనిలోనే అంతర్గతంగా "పత్రికా స్వేచ్ఛ" వంటి ముఖ్యమైన హక్కులు ఇమిడి ఉన్నాయి. సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం (బి),సంఘాలు పెట్టుకోవడం(సి),సంచార స్వేచ్ఛ (డి),స్థిర నివాస హక్కు (ఈ), ఇష్టమైన వృత్తి చేపట్టడం (ఎఫ్), ఆస్తి సంపాదన (జి), వంటివి వున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం భావ ప్రకటనా స్వేచ్ఛకు అడుగడుగునా అడ్డు తగులుతోంది. పత్రికా స్వాతంత్ర్యాన్ని కాల రాస్తూ ,సమావేశాలు, సభలకు అడ్డంకులు సృష్టిస్తున్నది. ఈ నేపథ్యంలో రాజ్యాంగ పరిరక్షణకు పోరుబాట చేపట్టాలి.

-టి.జనార్ధన్, ఏ.పి రైతుసంఘం నాయకులు

దళారీవ్యవస్థను రూపుమాపాలి

తెలంగాణ రాష్ట్రంలోని అనేక డిపార్ట్మెంట్‌లలో దళారీ వ్యవస్థ తిష్ట వేసి కూర్చుంది. దళారులు లేనిదే పని కాదు అన్న చందంగా వ్యవస్థను తయారు చేసారు. ఎంత చదువుకున్న వ్యక్తులైన,ఎంత సాంకేతిక పరిజ్ఞాన నిపుణులైన, ఎంత తెలివి తేటలు ఉన్నా దళారులను ఆశ్రయించనిది పనులు కావడం లేదు. దళారీ వ్యవస్థను రూపు మాపుతామని, ప్రజలు అధికారులను నేరుగా కలిసి తమ పనులను చేసుకోవొచ్చని, దళారులను ఎవరు ఆశ్రయించరాదని, అంతా పారదర్శకంగా జరుగుతుందని అవినీతి, లంచగొండితనం లేకుండా చేస్తామని నాయకులు, అధికారులు చెబుతున్న మాటలు నీటి మీద రాతలుగా మారుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో గల ఆర్టీఏ, రిజిస్ట్రేషన్, కోర్టు స్టాంప్ పేపర్, మున్సిపాలిటీ, విద్యుత్‌శాఖ, మండలాఫీస్ (తహసీల్దార్) కార్యాలయలలో ఇంకా అనేక డిపార్ట్మెంట్‌లలో దళారీ వ్యవస్థను ఆశ్రయించకుండా పనులు జరగడం లేదు. కొంతమంది అధికారులు డైరెక్ట్‌గా దళారులను ఆశ్రయించండి అని ఉచిత సలహాలు సూచనలు ఇస్తున్నారు. మనము సాంకేతికంగా అభివృద్ధి సాధించాము, కంప్యూటర్, ఇంటర్నెట్ యుగంలో ఉన్నాము, డిగ్రీలు, బి.టెక్‌లు చేశాము, అయినా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్తే చిన్న, చిన్న కారణాలు చూపుతూ మనం పెట్టుకున్న దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. దళారుల ద్వారా వెళ్తే మీ దగ్గర ఏ పత్రాలు లేకున్నా మీకు ఏ సర్టిఫికెట్ కావాలంటే ఆ సర్టిఫికెట్ దొరుకుతుంది. తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలో గల మండల తహశీల్దార్ కార్యాలయలలో కుల, ఆదాయ, నివాస, ఈ.బి.సి., క్రిమి లేయర్, నాన్ క్రిమి లేయర్, మరణ ధృవీకరణ పత్రం, కుటుంబ సభ్యుల (ఫ్యామిలీ మెంబర్) సర్టిఫికెట్ ఏది కావాలన్నా నెలలు, నెలలు తిప్పుతూ మీ సేవ కేంద్రాల్లో అడగండి లేదా ఇంకా పరిశీలనలో ఉంది అంటూ కాలయాపన చేస్తున్నారు. దళారులను ఆశ్రయిస్తే అధిక మొత్తాల్లో డబ్బులను డిమాండ్ చేస్తూ తాము లేనిదే పనే కాదు అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లి లైసెన్స్, ఆర్సీ, రెన్యూవల్, బ్యాంకులలో రుణాలు తీసుకొని మొత్తం తీరిపోయిన తర్వాత ఆర్సీ నుండి హైపోథీసిస్ అని తీసి వేయాలంటే చదువుకున్న సర్టిఫికెట్, బ్యాంకు అకౌంట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికేట్, ఆధార్ కార్డు ఇంకా అనేకసర్టిఫికెట్‌లు తీసుకొనిరావాలంటూ తిరస్కరిస్తున్నారు. దళారుల ద్వారా వెళ్తే ఏ సర్టిఫికెట్ గాని, ఏ పేపర్ గాని అడగకుండా మన పనులు చకచకా జరిగిపోతాయి.

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఇండ్లు, భూములు కొనుగోలు, అమ్మడం చేసినప్పుడు జనాల మధ్యలో ఉన్న ఇండ్లకు ప్రభుత్వ స్థలమని, రెడ్ జోన్ అని, దేవాలయ భూములని, వక్ఫ్ ఆస్తులని ఏదో ఒక వంకతో రిజిస్ట్రేషన్‌లు చేయడం లేదు. దళారుల ద్వారా వెళ్తే అదే భూమి క్లియర్ గా ఉందని రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఈ.సి., మార్కెట్ వాల్యూ, సర్టిఫైడ్ కాపీలు ఏది కావాలన్నా రోజుల తరబడి తిప్పుకొని తిరస్కరిస్తున్నారు. దళారులు ద్వారా వెళ్తే రెండు, మూడు రోజులలో మనకు ఏ సర్టిఫికెట్ కావాలంటే ఆ సర్టిఫికెట్ ఎలాంటి ఆధారాల అవసరం లేకుండా ఇస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లా కోర్టులలో అమ్మే బాండ్ పేపర్ల కోసం వెళ్తే ఎవరికి అవసరం ఉందో వారే రావాలని, ఆధార్ కార్డు తీసుకుని రావాలని, వేరే వారు వస్తే వచ్చిన వారి ఆధార్ కార్డు, బాండ్ పేపర్ల అవసరం ఉన్నా వారి ఆధార్ కార్డు తీసుకొనిరావాలని లేని పోని నిబంధనలు పెడ్తున్నారు. రిజిష్టర్‌లో సంతకం తీసుకొని బాండ్ పేపర్లను కొనడం పెద్ద తతంగంగా సీన్ క్రియేట్ చేస్తున్నారు. బయట దళారులు అదే బాండ్ పేపర్లకు ఏమి అడగకుండా, ఎక్కడి సంతకాలు తీసుకోకుండా అధిక మొత్తాల్లో డబ్బులను తీసుకొని విక్రయిస్తున్నారు. కోర్టులలో స్టాంప్ పేపర్, బాండ్ పేపర్లను అమ్మేవారే బయట కొనుగోలు చేయండి అని చెప్తున్నారు. మున్సిపాలిటీ కార్యాలయాలలో ప్రాపర్టీ ట్యాక్స్‌లో పేరు మార్చుకోవాలన్నా, గృహ నిర్మాణానికి అనుమతులు కావాలన్నా, ఇంకా జనన, మరణ ధృవీకరణ పత్రాలు కావాలన్నా ఇంకా ఏది కావాలన్నా చుక్కలు చూపిస్తున్నారు. దళారుల ద్వారా వెళ్తే చాలా సులభంగా పనులు జరుగుతున్నాయి. కాని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు దళారులు తీసుకొనే ధరలకు భూమి, ఆకాశం తేడా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో వందరెట్లు వీలైతే ఇంకా అనేక రెట్లు వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకొని దళారుల వ్యవస్థను నిర్మూలించాలి.

డాక్టర్.ఎస్.విజయభాస్కర్, 9290826988

ఐటి ఉద్యోగులలో కలవరం

ప్రైవేట్ రంగంలోని మల్టీ నేషనల్ టెక్నాలజీ కంపెనీలు, స్టార్టప్‌లు గత కొన్ని నెలలుగా భారీ స్థాయిలో తమ ఉద్యోగులను తొలగిస్తున్నాయి. దీంతో వేలాది మంది భారతీయ యువత భవిష్యత్తు అంధకారంలోకి వెళుతోంది. ఈ తొలగింపుల ప్రక్రియ ఇప్పట్లో ఆగేలాలేదు. ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. 2022లో ప్రపంచవ్యాప్తంగా దాదాపు వెయ్యి కంపెనీలు లక్షా 50 వేల మంది ఉద్యోగులను తొలగించాయి. 2023 వచ్చిన తరువాత ఈ నెల 16వ తేదీ వరకు రోజుకు 1600 మందిని తొలగించినట్లు అంచనా. ఆర్థిక వ్యవస్థపై ఇది ఎలాంటి ప్రభావం చూపుతుందోనని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే మైక్రోసాఫ్ట్, అమెజాన్, ట్విట్టర్, ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా లాంటి పెద్ద టెక్ కంపెనీలు భారీ సంఖ్యలో ఉద్యోగాలను తొలగించాయి. సిస్కో సంస్థ గత డిసెంబరులో 4 వేల మందిని తొలగించింది. అమెజాన్ 18 వేల మందిని, మైక్రోసాఫ్ట్ 10 వేల మందిని, గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ 12 వేల మందిని తొలగించేందుకు సిద్ధమయ్యాయి. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ ఇంజనీరింగ్, ప్రోగ్రాం మేనేజ్ మెంట్, ప్రొడక్ట్ డిజైన్ సహా అనేక విభాగాల్లో ఉద్యోగులను తొలగించినట్టు చాలానివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ తొలగింపుల కారణంగా భవిష్యత్తులో అనేక ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది.

అయితే, ఈ ఉద్యోగులు గతంలో మాదిరి కాకుండా దీనిపై పోరాడేందుకు సమాయత్తమవుతున్నారు. అత్యధిక మందిని తొలగిస్తుండటంతో వారు కూడా ఉద్యమాల బాట పట్టక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఉద్యోగాలు కోల్పోతున్న వేలాది మంది యువతీ-యువకులు తమ మేనేజ్‌మెంట్లతో ఏ విధంగా వ్యవహరించాలో, దేశంలోని కార్మిక చట్టాలు, కార్మిక హక్కులపై చర్చిస్తున్నారు. గతంలో వామపక్షాలకు చెందిన ట్రేడ్ యూనియన్లు ఇటువంటి ఉద్యమాలలో కార్మికులు, ఉద్యోగుల హక్కులపరిరక్షణలో కీలక భూమికను పోషించాయి. శరవేగంగా పెరిగిన సాఫ్ట్‌వేర్ రంగంలో వారు చొచ్చుకుపోలేకపోయారు. అంతేకాకుండా, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు అత్యధికంగా ప్యాకేజీలు, సౌకర్యాలు, ఆరోగ్య బీమాలు వంటివి ఉండటంతో వారు కూడా ట్రేడ్ యూనియన్లను పట్టించుకోలేదు. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా పరిస్థితులు మారిపోయాయి. ముఖ్యంగా కరోనా మహమ్మారి తరువాత అనేక మార్పులు వస్తున్నాయి. వర్క్ ఫ్రం హోం, ఉద్యోగులను తొలగించడం వంటివి కొనసాగుతున్నాయి. దాంతో ఉద్యోగులు ఆందోళనల బాట పట్టవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వారికి ఇప్పటివరకు కార్మిక, ఉద్యోగ ఉద్యమాలతో సంబంధంలేదు. లక్షల్లో ఉద్యోగులను తొలగించడంతో ఒక్కసారిగా వాటి అవసరం ఏర్పడింది. తొలగింపుల పరంపరతో ఉద్యోగులు సోషల్ మీడియాలో తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. విదేశాలలోని వారి సహచరుల వలె తమ అసంతృప్తిని తెలిపేందుకు ఇంటర్నెట్‌లను ఆశ్రయిస్తున్నారు.

ఆన్ లైన్ నెట్‌వర్క్ లను తయారుచేసుకుంటూ యాజమాన్యాలపై తమ పోరాటాన్ని ఎక్కుపెడుతున్నారు. ఉద్యోగాల తొలగింపుపై సహోద్యోగులను కూడగట్టి వారి హక్కులను కాపాడుకునేందుకు, పాత్రికేయులకు సమాచారాన్ని అందించేందుకు వాట్సాప్, స్లాక్ వంటి మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగిస్తున్నారు. కొన్ని దశాబ్దాల క్రితం వరకు కంపెనీలు తమ ఉద్యోగుల పనితీరు సరిగా లేకపోతే తొలగించేవారు. కానీ, నేడు పనితీరుతో సంబంధం లేకుండా పరిస్థితుల ప్రభావం వల్ల ఉద్యోగులను తొలగించడం సర్వసాధారణం అయిపోయింది. ఈ పరిణామాలను చూస్తుంటే ఉద్యోగం నుంచి తొలగించడం ఆమోదించిన వ్యాపార పద్ధతిగా మారిపోయిందని విశ్లేషకులు అంటున్నారు. ట్రేడ్ యూనియన్‌లు మునుపటిలా శక్తిమంతంగా లేవు. ఇటువంటి సందర్భంలో ఉద్యోగులకు సామాజిక మాధ్యమాలే తమ పోరాటాలకు వేదికగా మారుతున్నాయి. ఉద్వాసనకు గురైన ఉద్యోగులకు సామాజిక మాధ్యమాలు ఎంతవరకు ఉపయోగపడుతాయో లేదో తెలియదు గాని ఉద్యోగులను ఐక్యం చేయడంలో, నిరసనలకు ఊపందించడంలో మాత్రం అవి కీలకపాత్ర పోషిస్తాయని నిపుణులు చెబుతున్నారు. రేషనలైజేషన్ పేరుతో 2,500 మంది ఉద్యోగులను తొలగిస్తామని బైజూస్ అక్టోబరులో ప్రకటించిన తర్వాత ఉద్యోగులు మీడియా ముందుకు వచ్చి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. ఉద్వాసనకు గురైన ట్విట్టర్ ఉద్యోగులు తమ అసంతృప్తిని సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు. అనేక మంది ఉద్యోగులు తమ బాధలను చెప్పుకోవడానికి, తమ హక్కుల పోరాటం కోసం ఇతర మార్గాలను ఎంచుకుంటున్నారు. తిరువనంతపురంలో తమను బలవంతంగా రాజీనామా చేయించారని ఆరోపిస్తూ 140 మంది బైజూస్ ఉద్యోగులు నిరసనకు దిగారు. కేరళ మంత్రిని కలిసి తమ ఉద్వాసనపై దర్యాప్తు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఇది జరిగిన కొన్ని రోజుల తర్వాత తిరువనంత పురంలో తమ కార్యకలాపాలను మూసివేయాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్లు బైజూస్ ప్రకటించింది. ముందుముందు టెక్ ఉద్యోగులు తన బాధలను, నిరసన గళాన్ని వినిపించడానికి సామాజిక మాధ్యమాలే వేదకలవుతాయి. అందులో సందేహంలేదు.

- శిరందాసు నాగార్జున,
సీనియర్ జర్నలిస్ట్, 9440222914

కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వ అవినీతిపై

కాంగ్రెస్ 'మౌన దీక్షలు'

- బెంగళూరులో 280 చోట్ల నిర్వహణ
- సిద్ధరామయ్య హయాంలోనే అవినీతి : సీఎం బొమ్మై

బెంగళూరు : రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ అవినీతిపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో కర్ణాటక కాంగ్రెస్ సోమవారం నగరంలో దాదాపు 280 చోట్ల బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'మౌన దీక్షలు' నిర్వహించింది. 'అవినీతి నుంచి బయటపడండి, బెంగళూరును రక్షించండి' అనే పిలుపుతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిరసనలు జరిగాయి. ప్రతిపక్ష పార్టీపై ఎదురుదాడికి దిగిన ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై... కాంగ్రెస్‌ను అవినీతి గంగోత్రి (ఫౌంటెన్ హెడ్) అని అభివర్ణించారు. అవినీతిపై మాట్లాడే కాంగ్రెస్ పార్టీ మాట్లాడటం 'నవ్వు' తెప్పిస్తుందని అన్నారు. కాగా ఇక్కడి ట్రినిటీ సర్కిల్ జంక్షన్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో కర్ణాటక ఇన్‌ఛార్జి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, శాసన సభా పక్ష నేత సిద్ధరామయ్య సహా కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు సిద్ధరామయ్య విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం బెంగళూరు ప్రతిష్ఠను నాశనం చేస్తోందని, అధికార పార్టీ అవినీతి ఆకాశాన్నంటిందని ఆరోపించారు. లంచం ఇవ్వకుండా ఏ పనీ జరగడం లేదని సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఈ ప్రభుత్వాన్ని శాపనార్థాలు పెడుతున్నారని, అవినీతి నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 280కి పైగా చోట్ల మౌనదీక్షలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. గతసారి బెంగళూరులో అత్యధిక స్థానాలు గెలుచుకున్నాం. ఈసారి నగరంలోని 28 సీట్లలో 20కి పైగా గెలుస్తామన్నారు. ఓటమి భయంతో బీజేపీ బృహత్ బెంగళూరు మహానగర పాలికే (బీబీఎంపీ) ఎన్నికలను నిర్వహించడం లేదని, అసెంబ్లీ ఎన్నికల తర్వాత నిర్వహిస్తామని పేర్కొంటూ వాయిదా వేస్తోందని, కార్పొరేషన్ ఎన్నికలు జరిగితే వంద శాతం గెలిచేవాళ్లమని ఆయన అన్నారు. రెండేళ్లుగా నగరానికి కార్పొరేషన్ లేదని అన్నారు. బెంగళూరు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను బీజేపీ నిలబెట్టుకోలేకపోయిందని, ప్రజా పనులతో సహా అన్నింటిలో అవినీతి విపరీతంగా ఉందని, ఫలితంగా నాసిరకం పనులు, నగరానికి అధ్వానమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయని కేపీసీసీ అధ్యక్షుడు శివకుమార్ ఆరోపించారు. 'గుంతలు, చెత్త సమస్యలకు ఎవరు సమాధానం చెప్పాలి? నగరంలో అవినీతి 40 శాతం నుంచి 50 శాతానికి (ప్రజా పనులకు కమీషన్) పెరిగింది. వీధి వ్యాపారులను కార్పొరేషన్ అధికారులు, పోలీసులు వేధింపులకు గురిచేస్తున్నారు. వారి నుంచి వసూలు చేసిన డబ్బు ప్రతి నెలా ఒక్కో పోలీస్ స్టేషన్‌కు కోటి రూపాయలు. వీధి వ్యాపారుల నుంచి రోజుకు రూ.500 వరకు వసూలు చేస్తున్నారు' అని అన్నారు. కాంగ్రెస్ నిరసనపై బొమ్మై ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ గతంలో సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్, దాని ప్రభుత్వమే బీబీఎంపీ సహా ప్రతిచోటా అవినీతికి కారణమని అన్నారు. 'సిద్ధరామయ్య హయాంలో బెంగళూరులో ప్రీమియం 40 నుంచి 60 శాతానికి పెంచిన ఘనత వారిదేనని దాఖలాలు ఉన్నాయి. మీరు (కాంగ్రెస్) ఏదైనా అభియోగాలు మోపితే సాక్ష్యాలు అందించి, మేము చేస్తున్నట్లు లోకాయుక్తకు ఇవ్వండి' అని ఆయన అన్నారు. గత సిద్ధరామయ్య ప్రభుత్వం అవినీతి నిరోధక సంస్థ అయిన లోకాయుక్తను 'మూసివేసిందని' ఆరోపించారు. 'అప్పటి ముఖ్యమంత్రితో సహా తమపై 59 కేసులు ఉన్న చోటే (కాంగ్రెస్) లోకాయుక్తను మూసివేసి, ఏసీబీ (అవినీతి నిరోధక బ్యూరో) ని ఏర్పాటు చేసి ఎలాంటి విచారణ లేకుండానే బీ-నివేదికలు దాఖలు చేశారు. వారందరినీ ఇప్పుడు మేము లోకాయుక్తకు తిరిగి పంపాము. కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి భాగమే' అని బొమ్మై అన్నారు.

మల్లయోధులపై కేసు నమోదు చేయండి

ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన బ్రిజ్ భూషణ్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఇటీవల నిరసనలు చేసిన అగ్రశ్రేణి మల్లయోధులపై కేసు నమోదు చేయాలని రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) చీఫ్ బాధ్యతల నుంచి తాత్కాలికంగా తప్పుకున్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టును ఆయన ఆశ్రయించారు. లైంగిక వేధింపుల పేరుతో నిరసనకు దిగిన టాప్ రెజ్లర్లు, రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్ష పదవికి తాను రాజీనామా చేయాలని బలవంతం చేయడంతోపాటు తనను బ్లాక్‌మెయిల్ చేశారని ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ఈ నేపథ్యంలో తనపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసి నిరసనకు దిగిన రెజ్లర్లు వినేష్ ఫొగాట్, సాక్షి మాలిక్, సంగీతా ఫొగాట్, సుమన్ మాలిక్, అన్షు మాలిక్, బజరంగ్ పునియా తదితరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. మీడియాపై కూడా బ్రిజ్ భూషణ్ ఆరోపణలు చేశారు. మీడియా ఇప్పుడు జనతా అదాలత్ (పబ్లిక్ కోర్టు)గా మారిందని, కోర్టు విచారణలో జోక్యం చేసుకోవడం ప్రారంభించిందని విరుచుకుపడ్డారు. కొన్ని మీడియా సంస్థల పేర్లను కూడా పిటిషన్‌లో పేర్కొన్నారు. వాటిపై కూడా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

కేరళలో నోరో వైరస్!

కొచ్చి: కేరళలో నోరోవైరస్ కేసులు నమోదు అయ్యాయి. కొచ్చిలోని ఒక ప్రైవేటు స్కూల్‌లో పిల్లలకు నోరో వైరస్ సోకింది. దీంతో పాఠశాల విద్యార్థులకు సెలవులు ఇచ్చారు. ఒక పాఠశాల విద్యార్థిలో పిల్లలకు ఆ వైరస్ సోకినట్లు నిర్ధారించారు. నోరోవైరస్ సోకిన విద్యార్థులు వాంతులు, విరోచనాలు వస్తున్నాయి. కక్కనాడ్‌లోని ప్రైవేటు స్కూల్ విద్యార్థుల్లో ఈ లక్షణాలు కనిపించాయి. కొందరు చిన్నారులు పరీక్షలో పాజిటివ్‌గా తేలారు.దీంతో ఒకటో తేదీ నుంచి అయిదో తరగతి విద్యార్థులకు సెలవులు ఇచ్చారు. వ్యాధి వ్యాప్తిని అడ్డుకునేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు మొదలుపెట్టింది. నోరోవైరస్ ఓ అంటువ్యాధి. దాని వల్ల వాంతులు వస్తాయి. డయోరియా లక్షణాలు కూడా కనిపిస్తాయి. కొందరికి స్వల్పంగా జ్వరం, వణుకుడు, తలనొప్పి వస్తుంది.

కర్ణాటక హిజాబ్ వివాదంపై త్రిసభ్య ధర్మాసనం



న్యూఢిల్లీ: కర్ణాటకలో జరిగిన హిజాబ్ వివాదం దేశవ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఆ కేసుపై సుప్రీంకోర్టు సోమవారం కీలక తీర్పు ఇచ్చింది. హిజాబ్ వివాదంపై త్రిసభ్య ధర్మాసనంతో విచారణ చేపట్టనున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ వెల్లడించారు. ముస్లిం అమ్మాయిలు హిజాబ్‌ను ధరించి విద్యా సంస్థలకు వెళ్లడంపై ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. కాలేజీల్లో హిజాబ్ ధరించవద్దు అని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించిన సంగతి తెలిసిందే. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ వీ సుబ్రమణియన్, జస్టిస్ పర్దివాలాతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. సీనియర్ న్యాయవాది మీనాక్షీ ఆరోరా సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. ఫిబ్రవరి ఆరు నుంచి ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయని, విద్యార్థులకు ఎటువంటి సమస్య రావద్దు అని ఆ పిటిషన్‌లో కోరారు. ఈ నేపథ్యంలో సీజేఐ చంద్రచూడ్ స్పందిస్తూ.. ఈ సమస్యను పరిష్కరిస్తామని, దీన్ని త్రిసభ్య ధర్మాసనం విచారిస్తుందని, కొత్త తేదీను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యేలా మధ్యంత ఉత్తర్వులు జారీ చేయాలని మీనాక్షి కోరారు.

కల్తీ సారా తాగి ముగ్గురి మృతి

సివాన్ (బీహార్): మద్య నిషేధం అమల్లో ఉన్న బీహార్‌లోని సివాన్ జిల్లాలోని భోపత్‌పూర్ సబ్ డివిజన్‌లో నకిలీ మద్యం సేవించి ముగ్గురు మరణించగా, ఏడుగురు అస్వస్థతకు గురయ్యారని అధికారులు సోమవారం తెలిపారు. కడుపు నొప్పి, వికారం తల తిరగడంతో 10 మందిని ఆదివారం రాత్రి 7 గంటలకు సివాన్‌లోని జిల్లా ఆసుపత్రిలో చేర్చారు. 'సివాన్ ఆసుపత్రి వైద్యులు ఒకరు చనిపోయినట్లు ప్రకటించగా, ఇద్దరు వ్యక్తులు పాట్నా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు తీసుకెళుతుండగా మరణించారు. ప్రస్తుతం ఏడుగురు వ్యక్తులు సివాన్‌లోని జిల్లా ఆసుపత్రిలో చేరారు" వివరించారు. అస్వస్థతకు గురైన ఏడుగురిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఏప్రిల్ 2016 నుంచి బీహార్‌లో మద్యం నిషేధం అమలులో ఉంది. పోస్టుమార్టం రిపోర్టుల ఆధారంగానే మృతికి గల కారణాలు తెలుస్తాయని జిల్లా యంత్రాంగం తెలిపింది. 'ఈ ప్రాంతంలో ఇప్పటికే భద్రతా సిబ్బంది బృందం మోహరించింది. ఈ ఘటనపై సంబంధిత పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. ఈ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు 12 మందిని అరెస్టు చేశాం" అని వివరించారు. గతేదాది డిసెంబర్‌లో సరన్ జిల్లాలో నకిలీ మద్యం దాదాపు 50 మందిని బలితీసుకుంది. ఈ ఘటన బీహార్ అసెంబ్లీలో రాజకీయ దుమారాన్ని రేపింది. కల్తీ మద్యం మరణాల పునరావృత ఘటనలపై బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై ప్రతిపక్ష నాయకులు తీవ్ర దాడికి దిగారు.

లడాఖ్ ప్రజలకు మోదీ ప్రభుత్వం ద్రోహం

- వారి రాష్ట్ర హోదా డిమాండ్‌ను అంగీకరించడం లేదు
- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖడ్గే

న్యూఢిల్లీ : కేంద్రపాలిత ప్రాంతానికి రాష్ట్ర హోదా కల్పించాలని, పర్యావరణ సున్నిత ప్రాంతాన్ని పరిరక్షించాలనే లడాఖ్ ప్రజల డిమాండ్‌ను అంగీకరించకుండా మోదీ ప్రభుత్వం వారికి ద్రోహం చేసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే సోమవారం ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్ ప్రకారం గిరిజనులకు రాష్ట్ర హోదా, రక్షణ కల్పించాలనే తమ డిమాండ్‌ను అంగీకరించకపోవడం ద్వారా ప్రభుత్వం వ్యూహాత్మక సరిహద్దు ప్రాంతంలో భారత జాతీయ భద్రతకు ప్రమాదం కలిగిస్తోందని ఆయన ఆరోపించారు. 'నరేంద్ర మోదీ జీ, లడఖ్ ప్రజలు ఐక్యంగా కేంద్ర పాలిత ప్రాంతానికి రాష్ట్ర హోదాను, రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్ ప్రకారం ఈ ప్రాంతంలోని గిరిజన ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు' అని ఖడ్గే ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'కానీ మీ ప్రభుత్వం పెద్ద వాగ్దానాలు చేసినప్పటికీ, మోసపూరితంగా వారికి ద్రోహం చేసింది' అని అన్నారు. యూట్యూబ్‌లో షేర్ చేసిన వీడియోలో, లడఖ్‌కు చెందిన సామాజిక సంస్కరణవాది సోనమ్ వాంగ్‌చుక్, అతని జీవిత కథ బాలీవుడ్ చిత్రం '3 ఇడియట్స్' స్ఫూర్తిని కలిగి ఉంది. కేంద్ర పాలిత ప్రాంతమైన లడఖ్‌లో 2/3 వంతు హిమానీనదాలు అంతరించిపోతున్నాయని అధ్యయనాలు సూచిస్తున్నందున లడఖ్‌కు భద్రత, రక్షణ కల్పించాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. 'ఇది లడఖ్‌లోని (భారత హిమాలయాలలో) సోనమ్ వాంగ్‌చుక్ నుంచి భారతదేశం, ప్రపంచ ప్రజలకు పర్యావరణపరంగా సున్నితమైన లడాఖ్ ప్రాంతాన్ని రక్షించడంలో సహాయం చేయమని చేసిన తక్షణ విజ్ఞప్తి' అని వాంగ్‌చుక్ తన వీడియోలో తెలిపారు. అలాగే రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్ ప్రకారం సున్నితమైన పర్యావరణ వ్యవస్థను రక్షించాలని కోరారు. ప్రధాన మంత్రి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

లడఖ్‌లోని పర్యావరణ-సున్నిత హిమాలయ హిమానీ నదాలను దోపిడీ చేయాలనుకునే మోదీ ప్రభుత్వం 'ఎంపిక చేసుకున్న స్నేహితులకు ప్రయోజనం చేకూర్చాలనే దురాశ' అని అందరికీ తెలిసిందేనని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖడ్గే ఆరోపించారు. 'రాజ్యాంగ రక్షణను నిరాకరించడం ద్వారా, మీరు వ్యూహాత్మక సరిహద్దు ప్రాంతంలో భారతదేశ జాతీయ భద్రతను కూడా ప్రమాదంలో పడేస్తున్నారు. లడాఖ్ మాట వినండి' అని ట్వీట్ చేశారు.

మంచి అమ్మాయైతే మనువాడేస్తా: రాహుల్

న్యూఢిల్లీ: వివాహానికి తాను వ్యతిరేకం కాదు... సరైన అమ్మాయి దొరికితే వివాహం చేసుకుంటానని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. జోడో యాత్రలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూల్లో పలు ఆసక్తికర అంశాలు పంచుకున్నారు. భారత్ జోడో యాత్రలో భాగంగా సోషల్ మీడియాలో ఇచ్చిన ఇంటర్వ్యూ లోని ఓ వీడియో క్లిప్ ఇప్పుడు వైరల్ అవుతోంది. అందులో తన వివాహం గురించిన ప్రశ్నలకు రాహుల్ సరదాగా సమాధానాలు ఇచ్చారు. కాబోయే భాగస్వామి కోసం ఎలాంటి చెక్ లిస్ట్ లేదని, ప్రేమగా చూసుకునే అమ్మాయి, తెలివిగలది అయితే చాలునని అన్నారు. నా తల్లిదండ్రులు నిజంగా మనోహరమైన వివాహం చేసుకున్నారు. వారు ఒకరినొకరు పూర్తిగా ప్రేమలో ఉన్నారు. అని అతను తన తల్లిదండ్రులు రాజీవ్, సోనియా గురించి చెప్పారు. తాను ఆహారం గురించి పెద్దగా పట్టించుకోనని, అందుబాటులో ఉన్న ఏదైనా తింటానని, కానీ బఠానీలు, జాక్‌ఫ్రూట్ అంటే ఇష్టం లేదని తెలిపారు. కన్యాకుమారి నుంచి తన భారత్ జోడో యాత్రను ప్రారంభించిన రాహుల్... ఇప్పుడు జమ్మూకశ్మీర్‌లో ఉన్నారు. ఇంట్లో ఉన్నప్పుడు తన ఆహారం విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తానని చెప్పారు. కానీ ఇక్కడ తనకు పెద్దగా ఎంపిక లేదన్నారు.మాంసాహారానికి మొగ్గు చూపుతానని, చికెన్, మటన్, సీఫుడ్ వంటి అన్ని రకాల పదార్థాలను ఇష్టపడతానని రాహుల్ తెలిపారు. ఉదయం ఒక కప్పు కాఫీని ఇష్టపడతానన్నారు. తన మూలాలను చర్చిస్తూ, ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌కు మారిన కశ్మీరీ పండిట్ కుటుంబం తనదని చెప్పారు. 'తాత ఒక పార్సీ, కాబట్టి నేను పూర్తిగా మిశ్రమంగా ఉన్నాను' అని తన తాత ఫిరోజ్ గాంధీని ఉద్దేశించి చెప్పారు. తన ఉన్నత విద్య గురించి మాట్లాడుతూ... బ్రిటన్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం నుంచి డెవలప్‌మెంట్ ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీని పొందానని తెలిపారు. తాను ప్రధానమంత్రి అయితే చేస్తానని చెప్పిన మూడు విషయాలను రాహుల్ ప్రస్తావించారు... విద్యా వ్యవస్థను మార్చడం, చిన్న మధ్య తరహా వ్యాపారాలకు సహాయం చేయడం, రైతులు, నిరుద్యోగ యువతతో సహా గడ్డుకాలం అనుభవిస్తున్న ప్రజలను రక్షించడం. జనవరి 30న శ్రీనగర్‌లో ముగియనున్న భారత్ జోడో యాత్ర వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం భారతదేశంలో వ్యాప్తి చెందుతున్న ద్వేషం, అసహనం, హింసను ఎదుర్కోవడమేనని రాహుల్ పేర్కొన్నారు. తన సుదీర్ఘ నడకను ప్రస్తావిస్తూ... 'నాతో ఈ తపస్సు చేస్తున్నవారు చాలా మంది ఉన్నారు. నేను ఒంటరిగా లేను' అన్నారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ప్రతిరోజూ 25 కి.మీ నడుస్తున్న తన గురించి, తన ఫిట్‌నెస్ గురించి చర్చించుకుంటున్న వారి గురించి మాట్లాడుతూ... స్కూబా డైవింగ్, ఫ్రీ డైవింగ్, సైక్లింగ్, బ్యాక్‌ప్యాకింగ్, మార్షల్ ఆర్ట్స్ ఐకిడోలో తన అభిరుచుల గురించి కూడా మాట్లాడారు.

దేశ ఐక్యతకు విఘాతం కలిగించొద్దు

కేంద్రానికి మమత విజ్ఞప్తి

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జి మరోసారి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రత్యర్థి పార్టీలపైకి కేంద్ర ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్నదని ఆమె విమర్శించారు. "మీరు కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తే భయంతో పారిపోయేవాళ్లు చాలామందే ఉండొచ్చు, కానీ మేం (తృణమూల్ కాంగ్రెస్) మాత్రం భయపడం" అని అన్నారు. 'మీరు మీకు చేతనైంది చేసుకోండి. మేం అన్నింటిని భరిస్తాం. కానీ దేశాన్ని మాత్రం అమ్మకండి' అని మమతాబెనర్జి వ్యాఖ్యానించారు. 'దర్యాప్తు సంస్థలను మాపై ఎగదోయండి. కానీ దేశాన్ని, దేశ ప్రజలను మాత్రం ఐక్యంగా ఉండనీయండి' అని సూచించారు. కేంద్రం అడుగడుగునా రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నదని, రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమంటే ప్రజల హక్కులను కాలరాయడమేనని మమత అన్నారు.

ఎన్నికలకు నకిలీ కథనాలపై

సీఈసీ ధ్వజం

అవి ప్రజలను తప్పుదారి పట్టిస్తాయని వెల్లడి

న్యూఢిల్లీ : ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ సోమవారం భారతదేశం, విదేశాలలో ఎన్నికలకు 'లోతైన నకిలీ కథనాలు' కలవరపెట్టే ధోరణిపై ధ్వజమెత్తారు. విదేశాలలో 'అంతరాయం కలిగించే అంశాలు' ప్రజల అవగాహనను మార్చడానికి, నకిలీని వాస్తవంగా పదే పదే ప్రదర్శించడం ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నిస్తాయని తెలిపారు. సామాజిక వేదికలపై తమ అల్గారిథమ్ శక్తిని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని ఉపయోగించి నకిలీ కథనాలను 'ముందస్తు'గా గుర్తించాలని ఆయన అన్నారు. ముఖ్యంగా భారతదేశం వంటి అధికార పరిధిలో ఎన్నికల ప్రక్రియ కచ్చితమైనదని, బాగా నిర్వహించేదని ఆయన స్పష్టం చేశారు. 'సాంకేతిక వినియోగం-ఎన్నికల సమగ్రత' అనే అంశంపై ఇక్కడ ఎన్నికల సంఘం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో సీఈసీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం ప్రకటన ప్రకారం, కనీసం అధికారికంగా ధ్రువీకరించబడిన సంస్కరణలను నకిలీ సమాచారంతో సమానమైన ప్రాముఖ్యతతో చూపించడానికి ఈ వేదికల శోధన ఫలితాల్లో స్థాయికి తగినవిధంగా అంతర్నిర్మితంగా ఉండకపోవడంపై కూడా కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. 'నకిలీ కథనాలు'ను చురుగ్గా గుర్తించే బాధ్యతను సామాజిక వేదికలపై ఉంచడానికి సీఈసీ అమలు సంస్థల సారూప్యతను ఉపయోగించింది. 'నేరం తమకు నివేదించకపోతే చర్యలు తీసుకోబోమని దర్యాప్తు ఏజెన్సీలు చెబితే ఊహించడం కష్టమని ఆయన అన్నారు. నిఘా నివారణ వారి బాధ్యత కాదు' అని ప్రకటన పేర్కొంది. కఠినమైన, వ్యవస్థ 'గుర్తించదగిన' నకిలీ సమాచారాన్ని గుర్తించడం, వాటిని అప్‌లోడ్ చేయకుండా, సామాజిక మాధ్యమ వేదికలపై ప్రసారం చేయకుండా నిరోధించడం ఎవరి ప్రాథమిక బాధ్యత వంటి ప్రముఖ ప్రశ్నలను కూడా కుమార్ లేవనెత్తారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల సాంకేతికను కించపరిచే 'ధోరణి'ని కూడా ప్రస్తావించారు. ఈవీఎం హ్యాకింగ్‌పై మాజీ సీఈసీ టీఎస్ కృష్ణమూర్తికి సంబంధించిన నకిలీ వార్త ప్రతి ఎన్నికల ముందు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతూనే ఉంటుందని ఆయన అన్నారు. అయితే కృష్ణమూర్తి ఇటీవల తనకు ఆపాదించబడిన వార్తలను ఖండించారు. ఈసీ నిర్వహించనున్న మూడు సదస్సుల శ్రేణిలో రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సు రెండవది. ఇది కమిషన్ నేతృత్వంలోని ఎన్నికల సమగ్రతపై సమష్టి అధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. తొమ్మిది ఎన్నికల నిర్వహణ అధికారులు లేదా ఎన్నికల అధికారుల అధిపతులు, ఉప అధిపతులు సహా 16 దేశాలు ఈ సదస్సులో పాల్గొంటున్నాయి.

రిపబ్లిక్ డే రిహార్సల్.... ప్రయాణికులకు తప్పని పాట్లు

న్యూఢిల్లీ: రిపబ్లిక్ డే పరేడ్ రిహార్సల్ సందర్భంగా విధించిన ఆంక్షల కారణంగా సెంట్రల్ ఢిల్లీ రోడ్లపై ట్రాఫిక్ జామ్ ఎక్కువైంది. దీంతో సోమవారం ఉదయం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ సమస్య గురించి ప్రయాణికుల నుంచి తమకు అనేక ఫోన్ కాల్స్ వచ్చాయని పోలీసులు తెలిపారు. వికాస్ మార్గ్ (లక్ష్మీ నగర్ నుండి ఐటీఓ వరకు), ప్రగత్ మైదాన్, అక్షరధామ్ వంటి అనేక మార్గల్లో రద్దీ కనిపించింది. అంకితా సింగ్ అనే ప్రయాణికురాలు మాట్లాడుతూ, "నోయిడా నుండి అక్షరధామ్ వరకు ట్రాఫిక్ భారీగా ఉంది. ఐటీఓ వైపు వెళ్లే మార్గం కూడా జామ్ అయింది. ఐటీఓ దాదాపు 6 కిలోమీటర్ల దూరాన్ని కవర్ చేయడానికి 40 నిమిషాలు చూపించింది' అని పేర్కొన్నారు. అనేక మంది ప్రయాణికులు నగరంలో పరిస్థితిపై ట్వీట్ చేశారు. సెంట్రల్ ఢిల్లీలో పనిచేస్తున్న ప్రేరణాసింగ్ మాట్లాడుతూ 'నేను నగరంలోని దక్షిణ భాగంలో నివసిస్తున్నాను. గంటన్నరలో నా కార్యాలయానికి చేరుకుంటాను. అయితే, రిపబ్లిక్ డే రిహార్సల్ కారణంగా సోమవారం చాలా రోడ్లు మూసివేయబడ్డాయి. దీంతో ఆఫీసుకు వెళ్లేందుకు అదనంగా అర్థగం పట్టింది' అని తెలిపారు. కౌటిల్య మార్గ్, సర్దార్ పటేల్ మార్గ్, చాణక్యపురి, హౌజ్ ఖాస్‌లో కూడా భారీ రద్దీ నెలకొంది. రిపబ్లిక్ డే పరేడ్ కోసం సోమవారం పూర్తి డ్రెస్ రిహార్సల్‌ను సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు, ఆంక్షలపై ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు ముందే హెచ్చరించారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు విజయ్ చౌక్ నుండి రిహార్సల్స్ ప్రారంభమై కర్తవ్య మార్గం, సి-హెక్సాగాన్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ రౌండ్‌అబౌట్ విగ్రహం, తిలక్ మార్గ్, బహదూర్ షా జఫర్ మార్గ్, నేతాజీ సుభాస్ మార్గ్ మీదుగా ఎర్రకోట వద్ద ముగుస్తాయి. దీంతో ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి సోమవారం పరేడ్ ముగిసే వరకు కర్తవ్య మార్గంలో విజయ్ చౌక్ నుండి ఇండియా గేట్ వరకు ట్రాఫిక్‌ను అనుమతించలేదనీ, ఆదివారం రాత్రి 11 గంటల నుంచి కవాతు ముగిసే వరకు రఫీ మార్గ్, జనపథ్, మాన్ సింగ్ రోడ్‌లోని కర్తవ్య మార్గంలో వాహనాల రాకపోకలను కూడా నిషేధిస్తున్నట్టు ప్రకటించారు.

మహారాష్ట్ర రాజకీయాల్లో కొత్త కూటమి

ప్రకాశ్ అంబేద్కర్‌తో చేతులు కలిపిన ఉద్ధవ్ థాకరే

ముంబై : మహారాష్ట్రలో కొత్త రాజకీయ కూటమి ఏర్పాటయింది. ముంబై నగర పాలక సంస్థ ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కొనేందుకు ఉద్ధవ్ థాకరే, ప్రకాశ్ అంబేద్కర్ చేతులు కలిపారు. సోమవారం బాలాసాహెబ్ థాకరే జయంతిని పురస్కరించుకుని ఈ కొత్త కూటమి ఏర్పాటు ప్రకటన చేశారు. రెండు పార్టీలతో ఏర్పాటవుతున్న ఈ కూటమి... రానున్న రోజుల్లో బలమైన ప్రజాపక్షంగా తయారవుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న ముంబై నగర పాలక సంస్థ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కూటమిగా దగ్గరయ్యేందుకు ఉద్ధవ్ వర్గం-ప్రకాశ్ అంబేద్కర్ నిర్ణయించారు. సోమవారం ముంబైలోని ఉద్ధవ్ నివాసంలో జరిగిన ఒక సమావేశంలో నేతలు ఇద్దరూ ఈ కూటమిని ప్రకటించారు. గత రెండు నెలలుగా కూటమి తయారు కోసం చర్చలు జరుపుతున్నారు. రెండు పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు కూటమి ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. 'మహారాష్ట్రలోని చాలా మంది ప్రజలు మేం కలిసి రావాలని కోరుకున్నందుకు నేను సంతృప్తిగా, సంతోషంగా ఉన్నాను. ప్రకాశ్ అంబేద్కర్‌తో కలిసి కూటమిని ఏర్పాటు చేసేందుకు ఇక్కడ కలుసుకోవడం శుభసూచకం' అని ఉద్ధవ్ థాకరే అన్నారు. మా తాత, ప్రకాశ్ తాత ఇద్దరూ సహచరులుగా ఉండి అప్పట్లో సామాజిక సమస్యలపై పోరాడారని ఉద్ధవ్ చెప్పారు. థాకరే, అంబేద్కర్‌లకు చరిత్ర ఉన్నదని, ఇప్పుడు వారి భవిష్యత్ తరాలుగా తాము కూడా దేశంలోని ప్రస్తుత సమస్యలపై పోరాడేందుకు సిద్ధమయ్యామని పేర్కొన్నారు. ఈ కూటమి దేశంలో కొత్త రాజకీయాలకు నాంది అని ప్రకాశ్ అంబేద్కర్ అన్నారు. ప్రస్తుతానికి తామిద్దరమే కూటమిలో ఉన్నామని, కాంగ్రెస్ ఇంకా పొత్తును అంగీకరించలేదని తెలిపారు. శరద్ పవార్ కూడా తమ కూటమిలో చేరుతారని తాను ఆశిస్తున్నట్లు చెప్పారు.

వాడీవేడిగా రాజస్థాన్ అసెంబ్లీ

- పేపర్ లీకేజీల ఘటనపై ప్రతిపక్షాల నిరసన
- ముగ్గురు ఆర్ఎల్‌పీ ఎమ్మెల్యేల సస్పెన్షన్

జైపూర్ : పేపర్ లీకేజీల ఘటనలపై ప్రతిపక్షాల నిరసన మధ్య రాజస్థాన్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమయింది. అయితే తొలిరోజే ఆందోళన చేస్తున్న ముగ్గురు ఆర్ఎల్‌పీ ఎమ్మెల్యేలను రోజంతా సస్పెండ్ చేసి, వారిని బయటకు పంపాలని మార్షల్స్‌ను స్పీకర్ ఆదేశించారు. సోమవారం సభ సమావేశమైన వెంటనే, బీజేపీ ఎమ్మెల్యే, ప్రతిపక్ష నాయకుడు గులాబ్ చంద్ కటారియా పేపర్ లీక్‌ల అంశాన్ని లేవనెత్తారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు గందరగోళం సృష్టించడం ప్రారంభించారు. గవర్నర్ ప్రసంగిస్తున్నప్పటికీ, రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ ఎమ్మెల్యేలు పేపర్ లీక్ కేసులపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు చేతపట్టుకుని సభా వేదికపైకి దూసుకెళ్లారు. బీజేపీ ఎమ్మెల్యేలు కూడా వెల్‌లో నిరసన తెలిపారు. మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ తిరుగుబాటు కారణంగా అశోక్ గెహ్లాట్ ప్రభుత్వం రాజకీయ సంక్షోభంలో ఉన్నప్పుడు మద్దతు ఇచ్చిన సీపీఎం ఎమ్మెల్యే బల్వాన్ పూనియా కూడా పేపర్ లీక్ కేసులపై వెల్‌లో నిరసన తెలిపారు. గవర్నర్ ప్రసంగాన్ని కొంత సేపు చదివి అనంతరం ప్రసంగాన్ని ప్రవేశపెట్టారు. ప్రభుత్వం నిష్క్రమణతో సభ అరగంట పాటు వాయిదా పడింది. సభ తిరిగి సమావేశమైన తర్వాత కొత్తగా ఎన్నికయిన సభ సభ్యుడు అనిల్ కుమార్ శర్మ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం సమయంలో ఆర్ఎల్‌పీ ఎమ్మెల్యేలు పుఖ్‌రాజ్, నారాయణ్ బెనివాల్, ఇందిరా దేవి వెల్‌లో తమ నిరసనను కొనసాగించగా, ఇతర ప్రతిపక్ష సభ్యులు నిశ్శబ్దంగా కూర్చున్నారు. ఆయన సూచనలను ఆర్ఎల్‌పీ ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడంతో ముగ్గురు ఎమ్మెల్యేలను సభ నుంచి బయటకు తీసుకెళ్లాలని స్పీకర్ మార్షల్‌ను ఆదేశించారు. రోజంతా వారిని సభ నుంచి బహిష్కరించారు. పశ్చిమ బెంగాల్, బీహార్ మాజీ గవర్నర్ కేశరీనాథ్ త్రిపాఠి, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ములాయం సింగ్ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు భన్వర్ లాల్ శర్మ, రాజేంద్ర కుమార్ భారతీయ, జోధ్‌పూర్ సిలిండర్ పేలుడు ఘటనలో మృతులకు సభ నివాళులర్పించింది. అనంతరం సభ మంగళవారానికి వాయిదా పడింది.

సోషలిజం వైపు యువత మొగ్గు

క్యూబా ప్రజలు విప్లవోద్యమ పంథాను వదులుకోరు

సోషలిస్టు భావజాలం వైపు ప్రపంచవ్యాప్తంగా యువత మొగ్గు చూపుతున్నారన్నది సుస్పష్టమని చే గువేరా కుమార్తె డాక్టర్ అలైదా గువేరా అన్నారు. అమెరికా ఆంక్షల నుంచి విముక్తికి క్యూబా ఇప్పటికీ పోరాటం చేస్తూనే ఉందని, క్యూబా ప్రజలు తమ విప్లవోద్యమ పంథాను మాత్రం వదులుకోరని ఆమె తెలిపారు. అన్ని రంగాల్లో మేం చేసిన కృషి ప్రపంచానికే ఆదర్శప్రాయమని, సమాజంలో ఆర్థిక సమానత్వానికి, స్త్రీ, పురుష సమానత్వానికి కృషి చేసినప్పుడే చే గువేరా, కాస్ట్రో భావజాలానికి న్యాయం చేసిన వారమవుతామని అన్నారు. విజయవాడలో జరిగిన క్యూబా సంఘీభావ సభకు వచ్చిన అలైదా గువేరా ఈ సందర్భంగా విశాలాంధ్ర ప్రతినిధి ఈడ్పుగంటి రొమిలాకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్ర: ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా ఆంక్షలను క్యూబా ఎలా ఎదుర్కొంటోంది?

జ: అమెరికా క్యూబాపై చేపట్టిన ఆంక్షలను మేము మా పోరాటాలతోనే ధీటుగా ఎదుర్కొంటున్నాం. దీనికి అంతర్జాతీయంగా మాకు సంఘీభావం ఉంది. అన్ని రంగాల్లో మేం చేసిన కృషి ప్రపంచానికే ఆదర్శప్రాయం. విద్య, వైద్య అభివృద్ధికి, సామాజిక కట్టుబాట్లు రూపుమాపేందుకు, మహిళలకు సమాజంలో ఉన్నతస్థాయి కల్పించడంలో మేము చే గువేరా, కాస్ట్రో వారసులుగా వారి ఆశయ సిద్ధి కోసం కృషి చేస్తున్నాం. సామ్రాజ్యవాదాన్ని రూపుమాపేందుకు అంతర్జాతీయంగా క్యూబాకు ప్రపంచ దేశాలు కలిసికట్టుగా మాకు సంఘీభావాన్ని చూపుతూనే ఉన్నారు. నూతన తరాల కోసం, నూతన విలువలకు, మెరుగైన ప్రపంచానికి మేం కట్టుబడి ఉన్నాం. కరోనా నేపథ్యంలో క్యూబా ప్రస్తుతం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. కరోనా కాలంలో మా వైద్యులను ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు సహాయం కోసం పంపించిన సంఘటన అందరికీ తెలిసిందే. ముఖ్యంగా క్యూబా యువతను విద్యాపరంగా సాంస్కృతిక పరంగా, మార్క్స్ ఆర్థిక విధానాలను పటిష్టవంతం చేయడం ద్వారా సామ్రాజ్యవాద దేశాల నియంతృత్వాన్ని ప్రతిఘటించగలదు.

ప్ర: చే గువేరా వారసురాలుగా ఆయన ఆశయాలు, సిద్ధాంత వ్యాప్తికి మీరు ఎలా కృషి చేస్తున్నారు?

జ: ఫాసిస్టు విధానాలు, పెట్టుబడీదారీ నిరంకుశత్వ కబంధ హస్తాల నుంచి విముక్తి కోసం చే గువేరా కాస్ట్రోతో కలిసి క్యూబా విప్లవానికి, లాటిన్ అమెరికా దేశాల విముక్తికి అవిరళ కృషి చేశారు. నియంతృత్వ, సామ్రాజ్యవాద శృంఖలాల నుంచి స్వేచ్ఛాయుత జీవనానికి పోరాటం చేసిన గెరిల్లా నాయకుడు చే గువేరా. అమెరికా ఆంక్షల నుంచి విముక్తికి క్యూబా ఇప్పటికీ పోరాటం చేస్తూనే ఉంది. అయితే ఏ విషయంలోనూ క్యూబా ప్రజలు తమ పోరాట పటిమను వదులుకోదలచుకోలేదు. మేం పోరాడుతూనే ఉన్నాం. మేం ఎక్కడా రాజీ పడదలచుకోలేదు. ఆయన ఆశయ సిద్ధి కోసం క్యూబా ప్రజలు తమ విప్లవోద్యమ పంథాను మాత్రం వదులుకోరు. అర్జెంటీనా, నికరాగ్వా, బొలీవియా వంటి లాటిన్ అమెరికా దేశాలు సామ్రాజ్యవాద దేశాల నుంచి తమను తాము రక్షించుకోవటానికి పోరాడుతూనే ఉన్నారు.

ప్ర: భారతదేశంపై మీకు ప్రత్యేక అభిమానానికి కారణం?

జ: భారత దేశానికి, క్యూబాకు కొన్ని దశాబ్దాలుగా అవినావభావ సంబంధం ఉంది. కాస్ట్రో కాలం నుంచి భారతదేశానికి, క్యూబాకు స్నేహపూర్వక సత్సంబంధాలు ఉన్నాయి. స్వాతంత్ర్య పోరాటానికి భారతదేశం బాసటగా నిలిచింది. భారత ప్రజలు చూపిన తెగువ, సుదీర్ఘ పోరాటాలు మాకు ఆదర్శప్రాయం. అలీనోద్యమానికి భారతదేశం నాయకత్వం వహించింది. అప్పటి నుంచి ఇందిరాగాంధీతో మాకు ఉన్న సంబంధాలు భారతదేశంతో మిత్రత్వానికి ప్రధాన కారణం. గతంలో నేను భారతదేశ పర్యటనలో భారత పౌరులు నాపై చూపిన వాత్సల్యానికి, ప్రేమకు నేను సర్వదా కృతజ్ఞత తెలుపుతున్నారు. అదే వారసత్వాన్ని ఇప్పుడు కూడా చూస్తున్నాను. మీరందరూ చే గువేరా వారసురాలిగా మాపై చూపిస్తున్న అభిమానానికి అభినందనలు. ఆయన ఆశయ సిద్ధి కోసం కలిసికట్టుగా కృషి చేద్దాం.

ప్ర: ప్రపంచవ్యాప్తంగా చే గువేరా అభిమానులు కోకొల్లలు. యువత ముఖ్యంగా చే గువేరాకు ఆకర్షితులయ్యారు. చే గువేరా టీషర్టులు, పోస్టరు, టాటూలు ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. ఇది సోషలిస్టు సమాజంపై యువత మొగ్గుచూపడం అంటారా?

జ: టీషర్టులు, టాటూలతో బాహ్య ఆకర్షణలతో సమాజాన్ని మార్చలేం. చే గువేరా ఆశయాలను అమలు పరచడం ద్వారానే ఆయనపై అభిమానాన్ని మనం విస్తృతం చేయగలం. అయితే ఆ భావజాలం వైపు యువత ప్రపంచవ్యాప్తంగా ఆకర్షితులవుతున్నారనేది స్పష్టం. చే గువేరా, కాస్ట్రో భావజాల వ్యాప్తికి, ముఖ్యంగా యువతకు చారిత్రాత్మక పోరాటాలు పెద్దలు చెప్పడం ద్వారానో, పుస్తకాల పఠనంతోనే వారి ఆలోచనలో మార్పు తీసుకు రావలసిన అవసరం ఉంది. ముఖ్యంగా పాఠ్యాంశాలలో, కాలేజీల్లో, యూనివర్సిటీల్లో సమసమాజ వ్యాప్తికి, సోషలిస్టు భావజాల వ్యాప్తికి, మార్క్స్ భావజాలాన్ని విస్తృతంగా వ్యాప్తి చేయవలసి ఉంది. ముఖ్యంగా సమాజంలో ఆర్థిక సమానత్వానికి, స్త్రీ, పురుష సమానత్వానికి కృషి చేసినప్పుడే చే గువేరా, కాస్ట్రో భావజాలానికి న్యాయం చేసిన వారమవుతాం.

బాల్య దశలోనే పోరాడడం అలవర్చాలి

అలైదా గువేరా

విశాలాంధ్ర-విజయవాడ: పిల్లలకు బాల్య దశలోనే జీవిత, నైతిక విలువలు నేర్పాలనీ, హక్కుల సాధన కోసం పోరాడడం అలవర్చాలని క్యూబా విప్లవవీరుడు చే గువేరా కుమార్తె డాక్టర్ అలైదా గువేరా పిలుపునిచ్చారు. సోమవారం ఇక్కడి సిద్ధార్థ మహిళా కళాశాలలో లింగసమానత్వం అనే అంశంపై ఆమె మాట్లాడారు. క్యూబా విప్లవ అనంతరం మహిళలు బహురంగాల్లో అభివృద్ధి చెందారని తెలిపారు. సాంకేతిక, వైద్య, నిర్మాణ, మిలిటరీ రంగాల్లో మహిళలు బహుముఖ ప్రజ్ఞావంతులుగా ప్రపంచంలోనే ఆదర్శవంత దేశంగా నమోదైందని చెప్పారు. కోవిడ్ నియంత్రణలో కూడా తాము చూపిన తెగువ, సాయం ప్రపంచవ్యాప్తంగా సురపరిచితమన్నారు. ఆఫ్రికా దేశాల వారసత్వంగా కూడా తాము ఉన్నామని చెప్పారు. చైనీయుల వారసత్వం కూడా మాలో ఉందన్నారు. 19వ శతాబ్దిలో చాలామంది చైనీయులు క్యూబాకు వలస వచ్చారని తెలిపారు. విభిన్నదేశాల నుంచి వలసవాదుల రావడంతో విభిన్న దేశాల పౌరులు క్యూబాలో ఉన్నారన్నారు. విప్లవానికి ముందు క్యూబాలో పురుషాధిక్యత ఎక్కువగా ఉందన్నారు. మహిళలను జంతువుల కన్నా హీనంగా చూసేవారనీ, క్యూబాలో విప్లవానికి ముందు మహిళలకు గుర్తింపే ఉండేది కాదన్నారు. వారిని సమాజంలో పౌరులుగా కూడా గుర్తించలేదు. అటువంటిది క్యూబా విప్లవానంతరం అక్కడి సమాజంలో విభిన్నమార్పులు సంతరించుకున్నాయన్నారు. ప్రస్తుతం 72 శాతం పదవుల్లో మహిళలు క్యూబాలో కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. క్యూబాలో మహిళలు, పురుషులు సమానత్వాన్ని పాటిస్తున్నారు. ఎక్కువమంది సాఫ్ట్‌వేర్, వైద్యరంగంలో ఉన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించగలరని క్యూబా నిరూపిస్తోందన్నారు. క్యూబాలో ప్రతి మహిళకు అత్యున్నత గౌరవం ఉంది. మహిళలను మనం రక్షించుకోవలసి ఉంది. మహిళలు లేనిదే జీవితంలేదు అని అలైదా అన్నారు. "క్యూబాలో మిశ్రమ సంతతి ఉంది. విభిన్న దేశాలనుంచి వలసవచ్చిన సంతతి క్యూబాలో ఉంది. మనుషులందరూ సమానమే.. మనం నివసించే భూమి అనేది మనుషుల కన్నా మంచిది. అయితే ఒకరి కింద మనం ఉండలేం. మన హక్కులకోసం చిన్నప్పటినుంచి నేను ఎలా పోరాడాలన్నది మా తండ్రినుంచి నాకు వచ్చిన వారసత్వ సంపద. క్యూబా విప్లవంతో సామాన హక్కులు సాధించిందన్నారు. మా అమ్మాయికి నేను అన్ని పనులూ వ్యక్తిగతంగా నేర్చుకోవాలని చెబుతూ ఉంటాను. ఒకరిపై ఆధారపడకూడదని చాలా గట్టిగా చెబుతాను. భవిష్యత్తుతరాలకు ఆదర్శంగా ఉండాలంటే మనం పిల్లలకు కొన్ని జీవిత, నైతిక విలువలు నేర్పవలసి ఉంది. మన హక్కులసాధనకోసం మనమే పోరాడాలి" అని అలైదా అన్నారు.

అమెరికాలో కాల్పులు... తెలుగు విద్యార్థి మృతి

చికాగో: అమెరికాలో జరిగిన కాల్పుల్లో తెలుగు విద్యార్థి మృత్యువాత పడ్డాడు. చికాగోలో దుండగులు జరిపిన కాల్పుల్లో దేవాన్ష్ అనే విద్యార్థి ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. దేవాన్ష్ స్వస్థలం విజయవాడ. అదే ఘటనలో మరో తెలుగు విద్యార్థి, తెలంగాణలోని సంగారెడ్డికి చెందిన సాయి చరణ్ గాయపడ్డాడు. అతడి పరిస్థితి నిలకడగా ఉంది. వీరిద్దరితో పాటు మరో విద్యార్థితో వాల్‌మార్ట్‌కు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. చికాగోలోని గవర్నర్ స్టేట్ యూనివర్సిటీలో వీరు చదువుతున్నట్లు సమాచారం.

విప్లవానికి చే చిహ్నం

- ఆశయ సాధనకు పునరంకితం
- క్యూబాకు రాజకీయ, ప్రజాసంఘాల నేతల సంఘీభావం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమెరికా అగ్రరాజ్య విధానాల్ని అంత మొందించి, ముక్తకంఠంతో క్యూబాకు సంఘీభావం ప్రకటించాలని వామపక్ష, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. క్యూబాను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్ర ఆడిటోరియంలో సోమవారం క్యూబా సంఘీభావ సభ నిర్వహించారు. ఈ సభకు వచ్చిన ప్రపంచ విప్లవ పోరాట యోధుడు చే గువేరా కుమార్తె డాక్టర్ అలైదా గువేరాకు, మనుమరాలు ఎస్తేఫానియా గువేరాకు వారంతా ఘన స్వాగతం పలికారు. క్యూబా సంఘీభావ ఆహ్వానసంఘం కన్వీనర్లు బుడ్డిగ జమిందార్ సభకు స్వాగతం పలుకగా, సుంకర రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ దేశంలోకి యువతకు నేటికీ సర్దార్ భగత్‌సింగ్ ఆశాకిరణంగా నిలుస్తున్నారనీ, చే గువేరా విప్లవానికి ఒక చిహ్నంగా నిలిచారని కొనియాడారు. విప్లవ పోరాటం అనంతరం రష్యా మంత్రిగా ఆయన పనిచేసి, తరువాత పదవిని త్యజించి విప్లవంలోకి వెళ్లిపోవడం చూస్తే...చే గువేరా ఆశయం, తెగువ ఎంతో విలువైనదని తెలిపారు. చే గువేరా అమరులైనా ఆయన త్యాగమూ, తెగువ చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. తక్కువ జనాభా కలిగిన క్యూబా దేశం అమెరికా ఆధిపత్య విధానాల్ని ఎదిరించి ఆరు దశాబ్దాలుగా ఒక్క అడుగూ వెనక్కి వేయకుండా పోరాడుతోందన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ క్యూబాకు సంఘీభావం తెలుపుకోవడమంటే...మనకు మనం సంఘీభావం తెలుపుకోవడమేనన్నారు. చిన్నదేశమైన క్యూబా ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. క్యూబా మనకు మేలైన దేశమనీ, ఎన్ని కష్టాలు ఎదురైనా సోషలిజాన్ని కాపాడుకుంటూ తెగువతో ఉండిపోయారని వివరించారు. క్యూబా అభివృద్ధిని అమెరికా అణచివేస్తోందని, దానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రజల మన్ననలతోనే క్యూబా పోరాడుతోందన్నారు. క్యూబాపై అమెరికా ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పోరాటానికి చే గువేరా స్ఫూర్తిదాయకమని చెప్పారు. అటు దేశంలో రాజ్యాంగ వ్యవస్థల్ని నిర్వీర్యం చేస్తున్నారని, వాటికి వ్యతిరేకంగానూ పోరాడాల్సి ఉందని సూచించారు.

క్యూబా సంఘీభావ కమిటీ ప్రతినిధి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కరోనా సమయంలో క్యూబా శక్తివంతమైన ఐదు వాక్సిన్లు కనుగొనగా, దానికి కావాల్సిన డబ్బును అంతర్జాతీయ ఆరోగ్య సంస్థకు పంపేందుకు క్యూబా ప్రయత్నించగా, అమెరికా ఆధిపత్య విధానాలతో బ్యాంకులు సహకరించలేదన్నారు. 62 ఏళ్ల నుంచి క్యూబాను అమెరికా నిర్బంధిస్తోందనీ, అక్కడ మానవ హక్కులు లేవనే దిశగా అమెరికా విష ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యూబాను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. చే గువేరా వారసత్వాన్ని కొనసాగించడమంటే ఆయన ఆశయాల కొనసాగింపేనని పేర్కొన్నారు. సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ చే గువేరా అంతర్జాతీయ పోరాటాలకు ఒక చిహ్నంగా అభివర్ణించారు.

వైసీపీ ట్రేడ్ యూనియన్ నాయకులు పి.గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ విప్లవానికి మరోపేరు చే గువేరా అని చెప్పారు. టీడీపీ అధికార ప్రతినిధి జి.మాల్యాద్రి మాట్లాడుతూ 39ఏళ్ల వయస్సులో ప్రపంచాన్ని ప్రభావితం చేసిన వంద మందిలో చే గువేరా ఒకరని కొనియాడారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ చే గువేరా జీవితం వైవిధ్య భరితమని, పోరాట యోధుడిగా, రాజకీయ నాయకుడిగా, వైద్యునిగా బహుముఖ పాత్రలను పోషించారన్నారు. సీపీఐ(ఎంఎల్)-లిబరేషన్ నాయకులు వి.ప్రసాద్, సీపీఐ(ఎంఎల్) నాయకులు ఎన్.మూర్తి మాట్లాడుతూ ఫాసిజం విధానాలను అమెరికా నేటికీ అవలంబిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ(ఎంఎల్)-న్యూడెమోక్రసీ నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ చే గువేరా వారసులకు మద్దతుగా మనమంతా ఐక్యంగా నిలవాల్సి ఉందని, చే గువేరా సిద్ధాంతాల్ని ఆచరణలో పెట్టాలన్నారు. రివల్యూషనరీ, సోషలిస్ట్ పార్టీ నాయకులు జానకీరాములు మాట్లాడుతూ చే గువేరా ఒక విప్లవశక్తిగా విశ్లేషించారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదం క్రమేపీ పెరిగిపోతోందనీ, సాంస్కృతిక, సాంకేతిక రంగాలతో ఆధిపత్యధోరణిని ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఫార్వర్డ్‌బ్లాక్ నాయకులు పీవీ సుందరరామరాజు, ఎంసీపీఐ నాయకులు ఖాదర్ బాషా, సీపీఐ(ఎంఎల్) నాయకులు జాస్తి కిశోర్‌బాబు, ఎస్‌యూసీఐసీ నాయకులు బిఎస్ అమర్‌నాథ్ తదితరులు ప్రసంగిస్తూ చే గువేరా విప్లవపోరాట పటిమను విశ్లేషించారు. వేదికపైన సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు అంజయ్య, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి, ప్రముఖ వైద్యులు డాక్టర్ పర్మి, డాక్టర్ మాకినేని కిరణ్, డాక్టర్ రామప్రసాద్ ఉన్నారు. ఈ వేదికపై క్యూబాకు సంఘీభావంగా నేతలు చేతులు కలిపి...ఐక్యనినాదం చేశారు.

మైనర్‌లను పెళ్లి చేసుకుంటే పోక్సో యాక్ట్: అసోం సీఎం



గువహతి: పద్నాలుగు సంవత్సరాల లోపు బాలికలను పెళ్లి చేసుకునే యువకులపై పోక్సో యాక్ట్ అమలు చేసేలా అసోం కేబినెట్ సోమవారం నిర్ణయించిందని ముఖ్యమంత్రి హిమంత బిస్వాస్ శర్మ తెలిపారు. అసోంలో బాల్య వివాహాలు పెద్ద ఎత్తులో జరుగుతుంటాయి. 31శాతం వివాహాలు ఇలా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి కేబినెట్ సమావేశం అనంతరం విలేకరులకు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడ బాల్యవివాహాలు జరిగినా పోలీసులు నేరుగా వాటిని అడ్డుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామానికి చిన్నారుల భద్రతా అధికారిని నియమిస్తామని, ఏ ప్రాంతంలోనైనా బాల్యవివాహం జరుగుతోందని గ్రామ పంచాయతీ కార్యదర్శికి తెలిస్తే తక్షణమే ఆ అధికారికి ఫిర్యాదు చేసే బాధ్యత వారిదేనని శర్మ అన్నారు.

మూడో వన్డే... కీలక మార్పులు

ఇండోర్: న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను భారత జట్టు తన ఖాతాలో వేసుకుంది. రాయ్‌పూర్‌లో జరిగిన రెండో వన్డేలో కివీస్‌ను చిత్తుగా ఓడించింది. ఈ క్రమంలో మంగళవారం జరిగే మూడో వన్డేలో భారత జట్టులో మూడు కీలక మార్పులు చేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఇప్పటికే సిరీస్ నెగ్గిన భారత జట్టు పూర్తి బలంతో బరిలో దిగడం లేదని, కొత్త వాళ్లకు అవకాశం ఇవ్వాలని ఆలోచిస్తోందని సమాచారం.

షమీకి బ్రేక్

రెండో వన్డేలో కివీస్ పతనాన్ని శాసించిన వెటరన్ పేసర్ మహమ్మద్ షమీకి మూడో వన్డేలో విశ్రాంతి ఇవ్వాలని టీమిండియా మేనేజ్‌మెంట్ భావిస్తోందట. అతని స్థానంలో తొలి రెండు వన్డేల్లో అవకాశం దక్కని జమ్ము ఎక్స్‌ప్రెస్ ఉమ్రాన్ మాలిక్‌ను మూడో వన్డేలో తీసుకుంటారని సమాచారం. తొలి రెండు వన్డేల్లో ఉమ్రాన్‌ను తీసుకోకపోవడం ఫ్యాన్స్‌కు ఏమాత్రం రుచించలేదు. శ్రీలంకపై అద్భుతంగా ఆడిన అతనికి కివీస్‌పై కూడా సత్తా చాటే ఛాన్స్ ఇవ్వాలని అభిమానులు డిమాండ్ చేస్తున్నారు.

హార్దిక్ స్థానంలో...

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ఫిట్‌నెస్‌పై బీసీసీఐ ప్రత్యేక ఫోకస్ పెట్టిన సంగతి తెలిసిందే. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో టీమిండియాకు పాండ్య చాలా కీలకం. అతను కివీస్‌తో టీ20 సిరీస్ కూడా ఆడాల్సి ఉంది. దీంతో అతనికి మూడో వన్డేలో విశ్రాంతినివ్వాలని టీమిండియా భావిస్తోంది. అతని స్థానంలో బెంగాల్ ఆల్‌రౌండర్ షాబాజ్ అహ్మద్‌కు అవకాశం ఇస్తారని సమాచారం. బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో పెద్దగా ఆకట్టుకోని షాబాజ్.. కివీస్‌పై సత్తా చాటాలని ఎదురు చూస్తున్నాడు.

విరాట్ ఆడటం లేదా?

టీమిండియా స్టార్ విరాట్ కోహ్లిని స్పిన్ బౌలింగ్ తెగ ఇబ్బంది పెడుతోంది. కివీస్‌తో ఆడిన రెండు వన్డేల్లో కూడా మిచెల్ శాంట్నర్ బౌలింగ్‌లోనే కోహ్లి ఔటయ్యాడు. దానికితోడు బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి ముందు టీమిండియా ఆటగాళ్లు రంజీలు ఆడాలని మాజీలు అంటున్నారు. ముఖ్యంగా రవిశాస్త్రి తన కామెంటరీ సమయంలో కూడా కోహ్లికి ఇదే సజెషన్ ఇచ్చాడు. నిజంగానే కోహ్లి కనుక దిల్లీ తరపున రంజీ ఆడాలని డిసైడ్ అయితే.. అతని స్థానంలో రజత్ పటీదార్‌కు జట్టులో చోటు దక్కే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే జడేజా, పుజారా రంజీలు ఆడుతున్నారు. దీంతో కోహ్లి కూడా ఇదే పని చేస్తాడని టాక్ వినిపిస్తోంది. ఈ క్రమంలో పటీదార్ టీమిండియా తరపున అరంగేట్రం చేస్తాడని సమాచారం.

రాష్ట్ర హోదా పునరుద్ధరణకు సర్వశక్తులు ఒడ్డుతాం

జమ్ముకశ్మీర్ జోడో యాత్రలో రాహుల్

జమ్ము: రాష్ట్ర హోదా డిమాండ్ జమ్ముకశ్మీర్ అతిపెద్ద సమస్య అని, రాష్ట్ర హోదాను పునరుద్ధరించడానికి కాంగ్రెస్ తన పూర్తి శక్తిని ఉపయోగిస్తుందని పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ తెలిపారు. సోమవారం ఇక్కడ ఆయన చేపట్టిన భారత్ జోడో యాత్రకు భారీ స్వాగతం లభించింది. తన యాత్రలో జమ్ము కశ్మీర్‌లోని అన్ని వర్గాల ప్రజలను కలుసుకున్న రాహుల్... దేశంలో అత్యధిక నిరుద్యోగం జమ్ము కశ్మీర్‌లో ఉందని అన్నారు. 'కాంగ్రెస్ పార్టీ మీకు, మీ రాష్ట్ర హోదా (డిమాండ్) పూర్తిగా మద్దతు ఇస్తుంది. రాష్ట్ర హోదాను పునరుద్ధరించడానికి, కాంగ్రెస్ పార్టీ తన పూర్తి శక్తిని ఉపయోగిస్తుంది' అని గాంధీ ఇక్కడ సత్వారీ చౌక్‌లో జరిగిన సమావేశంలో అన్నారు. 'రాష్ట్ర హోదా మీ అతిపెద్ద సమస్య. మీ హక్కు లాగేసుకుంది' అని అన్నారు. తన యాత్రలో జమ్ముకశ్మీర్‌కు చెందిన అన్ని వర్గాల ప్రజలను కలుసుకున్నానని, వారు అనేక సమస్యలను లేవనెత్తారని చెప్పారు. పాలనా యంత్రాంగం తమ గొంతు వినడం లేదని వారు తనతో చెప్పారని ఆయన అన్నారు. 'మొత్తం వ్యాపారాన్ని బయటి వ్యక్తులు నడుపుతున్నారు. జమ్ము కశ్మీర్ ప్రజలు నిస్సహాయంగా కూర్చొని చూస్తున్నారు' అని తెలిపారు. జమ్ముకశ్మీర్‌లో దేశంలో నిరుద్యోగం అత్యధికంగా ఉందని గాంధీ అన్నారు. యువకులు ఇంజనీర్లు, వైద్యులు, న్యాయ వాదులు కావాలని ఆకాంక్షిస్తున్నారని, కానీ వారు అలా కాలేమని గుర్తుస్తున్నారని తెలిపారు. 'ఇంతకు ముందు (ఉపాధి పొందేందుకు) మరొక మార్గం ఉంది. అది సైన్యంతో జరిగింది. అది కూడా ఇప్పుడు బీజేపీ ప్రవేశపెట్టిన అగ్నివీర్ అనే కొత్త పథకం ద్వారా మూసుకుపోయింది' అని తెలిపారు.

కశ్మీరీ పండిట్లకు అన్యాయం... ఎల్‌జీ వారికి క్షమాపణ చెప్పాలి

ప్రభుత్వం చేతిలో కశ్మీర్ పండిట్లకు అన్యాయం జరుగు తోందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపిం చారు. జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాను ప్రధాని ప్యాకేజీ ఉద్యోగులకు భిక్ష పెట్టవద్దని చెప్పినందుకు పండిట్లకు క్షమాపణలు చెప్పాలని కోరారు. అంతకుముందు రోజు సాంబా జిల్లాలో తన భారత్ జోడో యాత్ర సందర్భంగా కశ్మీరీ పండిట్ ప్రతినిధి బృందం ఆయనను కలిసి, ఉగ్రవాదులచే 'లక్ష్యంగా జరిగిన హత్యలు', ప్రధాన మంత్రి ప్యాకేజీ కింద ఉద్యోగాలు చేసిన వారి ఫలితంగా నిరసనలతో సహా వారి వివిధ సమస్యల గురించి ఆయనకు వివరించిన కొద్దిసేపటికే రాహుల్ ఈ ప్రకటన చేశారు. 'కశ్మీర్ పండిట్‌లకు ఈ ప్రభుత్వం అన్యాయం చేస్తోంది. ఈ రోజు ఉదయం, కాశ్మీరీ పండిట్‌ల ప్రతినిధి బృందం నన్ను కలుసుకుని, వారి సమస్యలను వివరించింది. భిక్ష కోర కూడదని వారి ప్రతినిధి బృందానికి లెఫ్టినెంట్ గవర్నర్ చెప్పారని తెలిసి నేను ఆశ్చర్య పోయాను' అని రాహుల్ ఇక్కడ సత్వారిలో రోజు యాత్ర ముగింపు సందర్భంగా ఒక సభలో చెప్పారు. తాము భిక్ష కోరడం లేదని, తమ హక్కులను కోరుతున్నామని లెఫ్టినెంట్ గవర్నర్‌కు చెప్పాలనుకుంటున్నట్లు రాహుల్ అన్నారు. 'మీరు (ఎల్జీ) వారి (పండిట్లు) నుంచి క్షమాపణ కోరాలి' అని అన్నారు.

మేరీకోమ్ కమిటీకి రెజ్లింగ్ సమాఖ్య బాధ్యతలు

న్యూఢిల్లీ: మహిళా రెజర్లపై వేధింపుల ఆరోపణల విషయంలో కీలక నిర్ణయం వెలువడింది. లైంగిక వేధింపుల ఆరోపణలను నిగ్గు తేల్చేందుకు కేంద్రం పర్యవేక్షక కమిటీని ఏర్పాటు చేసింది. ప్రముఖ బాక్సర్, రాజ్యసభ మాజీ సభ్యురాలు మేరీకోమ్ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల కమిటీని నియమించింది. ఇకనుంచి నెల రోజులు భారత రెజ్లింగ్ సమాఖ్య రోజువారీ వ్యవహారాలను ఈ కమిటీ చూసుకుంటుంది. అధ్యక్షుడితో పాటు సమాఖ్యపై వివిధ ఆరోపణలు చేస్తూ దేశ అగ్రశ్రేణి రెజ్లర్లు దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మూడు రోజుల పాటు ధర్నా చేయడం సంచలనంగా మారింది. క్రీడల మంత్రితో గత శుక్రవారం జరిపిన చర్చల అనంతరం రెజ్లర్లు ఆందోళన విరమించారు. ఇదిలా ఉంటే.. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) ఆదివారం నిర్వహించ తలపెట్టిన అత్యవసర సర్వసభ్య మండలి సమావేశం రద్దయింది. విచారణ ముగిసేంతవరకూ సమాఖ్య కార్యకలాపాలను కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ నిషేధించిన సంగతి తెలిసిందే. విచారణ ముగిసేంతవరకూ ఈ వ్యవహారాలకు దూరంగా ఉండాలని భూషణ్‌ను ఆదేశించింది. కానీ శనివారం యూపీలోని నందిని నగర్‌లో రెజ్లింగ్ పోటీలకు అతను హాజరు కావడం గమనార్హం. ఇదిలా ఉంటే.. ఈ ఆరోపణలపై దర్యాప్తు జరిపేందుకు భారత ఒలింపిక్ అసోసియేషన్ ఏడుగురు సభ్యులతో ఇదివరకే కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో మేరీ కోమ్‌తోపాటు డోలా బెనర్జీ, అలకనంద అశోక్, యోగేశ్వర్ దత్, సహదేవ్ యాదవ్ తదితరులు సభ్యులుగా ఉన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.